ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
30 అక్టోబర్, 2011

# మరో గ్లో'బలి'

# 2011 హ్యాపీబర్త్‌డే

(2011 అక్టోబర్ 30 నుంచి
2011 నవంబర్ 5 వరకు)

బి.శ్రీ వరుణ్
అక్టోబర్
జ్యోతి-శ్రీనివాసరెడ్డి
ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి

ఆర్.నాని
అక్టోబర్
కవిత-భానుచందర్
కోకాపేట్,రంగారెడ్డి జిల్లా

కె.దుర్గా మహాలక్ష్మి (దీక్ష)
అక్టోబర్
అనురాధ-గణేష్
గోషామహల్-హైదరాబాద్

పి.హర్షిణి
అక్టోబర్
ధనశ్రీ-రవిమోహన్
విజయనగరం



మరియం ఖిల్జీ
అక్టోబర్
షానవాజ్-అబ్దుల్ కలాం
జెండావీధి, నెల్లూరు

ఎం.లక్ష్మీ దీపిక
అక్టోబర్ 30
విజేత-కిరణ్
రెల్ల, విజయనగరం

పి.సాయివిఘ్నేష్
అక్టోబర్ 31
రేణుక-గజేందర్
కోటగిరి, నిజామాబాద్

వి.సాయి ప్రణవ్
నవంబర్ 3
ఉదయ-ప్రసన్న కుమార్
బొబ్బిలి,విజయనగరం

ఎస్.ఎన్.తేజ
నవంబర్ 3
దేవి-మధు
కొత్తగూడెం, ఖమ్మం

నవతేజ్
నవంబర్ 3
రమాదేవి-ఆర్.వి.నర్సింహారావు
హైదరాబాద్

మనలో మాట

# శాంతి మంత్రం

నల్లానల్లనివాడు
రింగురింగులా జుట్టువాడు
ఆజానుబాహుండు
నిత్యం శాంతినామస్మరణ చేసేవాడు
శాంతి స్థాపనకై సరిహద్దులను లెక్కచేయనివాడు
అమాయకుల నెత్తురు ఏరులై పారినా
ప్రపంచ శాంతి మాత్రం వర్ధిల్లాలనేవాడు
ఒక్కడే ...ఆ ఒక్కడు...
ప్రపంచ పెద్దన్న బిరుదాంకితుడు
శ్వేతసౌధంలో విరిసిన నల్ల సూరీడు

◆◆◆

పెద్దన్న అధక్ష్యపీఠాన్ని అధిష్టించిన క్షణాల్ని గుర్తుచేసుకుందాం. ప్రపంచానికి మోడర్న్ శాంతిదూతలా పోజిచ్చాడు. 'ఇప్పటిదాకా అయ్యింది చాలు. ఇరాక్ నుంచి అమెరికా సైన్యాన్ని వెనక్కి రప్పిస్తాం' అని ప్రవచించినప్పుడు యావత్ ప్రపంచం పొంగిపోయింది. ఎక్కుపెట్టిన తుపాకులు, యుద్ధ విమానాల నుంచి విముక్తి లభించబోతోందని ఊపిరి పీల్చుకుంది.

ఏళ్లకు ఏళ్లు గడిచిపోతున్నా.. ఎందరి ప్రాణాలు పోతున్నా...ఎందరు అనాథలౌతున్నా... ఆ ఘడియ మాత్రం రావడంలా. బహుశా అక్కడ పెద్దన్న కోరుకున్న రీతిలో శాంతి స్థాపన జరగలేదేమో! అందుకే ఇంత ఆలస్యమేమో!

శాంతిస్థాపన కోసం పెద్దన్న చేయని ప్రయత్నం లేదు. ప్రపంచ పీడలా పరిణమించిన ఉగ్రవాదంమీద పోరు సాగించేందుకు చేతులు కలపమని ప్రార్థనలు చేశాడు. 9/11 దెబ్బకు దిమ్మ తిరిగి ఆ నిర్ణయం తీసుకొని వుండొచ్చు.

తాము సృష్టించిన భస్మాసురుడు లాంటి లాడెన్‌ను వధించి ప్రపంచ శాంతి సాధించలాన్నది కూడా పెద్దన్న కోరికే. అందుకోసం సప్త సముద్రాలు దాటి పాకిస్తాన్‌లో రహస్యజీవితం గడుపుతున్న లాడెన్‌ను ఆ ప్రభుత్వానికే తెలీకుండా చొరబడి చుట్టుముట్టి చంపిపారేశాడు. ఇదంతా శాంతిస్థాపనకేనన్నాడు.

ప్రపంచంలో ఎక్కడా అణ్వాయుధాలుగానీ, రసాయన ఆయుధాలుగానీ వుండకూడదు. ఎక్కడా 'నియంతృత్వ' పాలన సాగకూడదు. ఒక్క తమ దగ్గర తప్ప అంటాడు. ఇరాక్ పని అయిపోయింది. ఇక ఇరాన్ సంగతి చూడాలట! ఎందుకంటే అక్కడ అణుబాంబులు వున్నాయేమోనని పెద్దన్నకు అనుమానంగా వుందట. ఆ సాకుతో ఆ దేశం మీదకు పెద్దన్న సైన్యం దండెత్తినా ఆశ్చర్యం లేదు.

కుక్కను చంపాలనుకున్నప్పుడు 'పిచ్చిది' అంటే చాలు జనమే రాళ్లేసి కొట్టి కొట్టి చంపుతారు. ఆ విద్య పెద్దన్నకు మాబాగా తెలుసు. అందుకే లిబియా అధ్యక్షుడు గడాఫీకి 'నియంత' అన్న బిరుదు ఇచ్చేసి ప్రచారం చేశాడు. నడివీధిలో నాటో సైన్యంతో చంపించేశాడు. మరోవైపు సిరియా అధ్యక్షుడు కూడా 'నియంత'లాగే కనిపిస్తున్నాడు పెద్దన్నకు. ఎప్పుడు ఎవరు ఎలా కన్పిస్తారో చెప్పలేం! మరి ఆయన్ని ఏం చేస్తాడో! పెద్దన్న ఏం చేసినా అంతా శాంతికోసమే. ప్రపంచం కళ్లు మూసుకొని నమ్మాలి. నమ్మకపోతే పెద్దన్న శాంతిమంత్రం మట్టుబెడుతుంది.

★

## ఈ సంచికలో....


| | | |
|---|---|---|
| టపా | ... | 2 |
| రుచి | ... | 3 |
| కవిత్వమ్ | ... | 4 |
| ఎవరి గోల వారిదే | ... | 8 |
| నవ్వుల్ పువ్వుల్ | ... | 9 |
| చూద్దామా | ... | 12 |
| అట్టమీది కథ | ... | 14 |
| కార్టూన్లు | ... | 18 |
| కొత్త పుస్తకాలు | ... | 19 |
| బాలనేస్తాలు | ... | 22 |
| మాటల కోట | ... | 24 |


## ఇంకా...




కథ .... 6
జ్ఞాపకాల బావి



ఈ పేజ్ ... 10
బ్యాకప్ అందించే యుపిఎస్

వికాసం ... 20
దాంపత్యం ఉల్లాసంగా... ఉత్సాహంగా...



పాత బంగారం ... 21
కాల పరీక్షకు నిల్చిన కల్పన



## మనకెప్పుడో...

**'తె**లుసుకుందామా' ఆసక్తికరంగా ఉంది. తొమ్మిది కోట్ల జనాభా ఉన్న వియత్నాంలో బౌద్ధమతస్తులే అధికమని తెలిసింది. టెర్రరిస్టుల బెడద, శాంతి భద్రతల సమస్య లేకుండా ప్రశాంతంగా ఉందంటే చాలా సంతోషంగా ఉంది. అటువంటి పాలన మన దేశంలో కూడా ఉంటే బాగుంటుంది. ఆర్థిక వ్యత్యాసాలున్నప్పటికీ దోపిడీ అనేదే లేదంటే ఆశ్చర్యంగా ఉంది. గ్రీసు 'కవర్‌స్టోరీ' బాగుంది. కవులను ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు.

**టి. శ్రీరామమూర్తి, విశాఖ.**

## చిన్ననాటి జ్ఞాపకాలు

**చా.సో** 'పాత కథ' చదివిన వారందరూ చిన్ననాటి జ్ఞాపకాల్లో మునిగిపోతారు. 'సినిమా' పరిశ్రమ వినోదాలకే పరిమితం కాదు. దానికి సామాజిక బాధ్యత కూడా ఉందని రచయిత గుర్తుచేశారు. సమాజంలోని సమస్యలు, వాటికి పరిష్కారాలను తెలుగు సినీ పరిశ్రమ చూపడం లేదు. అదే కాకుండా నటీ నటులు తీసుకుంటున్న పారితోషికాలు కూడా చాలా ఎక్కువగా ఉంటున్నాయి. సినిమా సరిగా ఆడక నిర్మాత నష్టపోతున్నాడు. సినీ పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోడానికి ఇటువంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. పెట్టుబడిదారీ దేశాల్లో మానవ విజ్ఞానానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందని 'ఎవరిగోల వారిదే' ద్వారా తెలుస్తోంది. వియత్నాం విశేషాలు బాగున్నాయి. జన జీవనానికి అడ్డం లేకుండా మతాన్ని విడదీయడం వల్ల, స్త్రీ శ్రమ శక్తిని పూర్తిగా ఉపయోగించడం వల్లనే ఆ దేశం అతి వేగంగా అభివృద్ధి చెందిందని అర్థమౌతోంది. 'అట్టమీద కథ' బాగుంది. అప్పుల భారంతో దివాలా తీస్తున్న గ్రీకు దేశంలో పెట్టుబడిదారులు, కార్పొరేట్ కంపెనీలు లాభపడేలా వారికే అప్పులు ఇవ్వడం... చూస్తుంటే అక్కడి ఆర్థిక సంస్కరణ విధానం ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తోంది.

**ఇలిపిళ్ల సూర్యనారాయణ, విజయవాడ.**

## కాస్త ప్రోత్సాహం...

**'వి**కాసం'లో ఆడ, మగ తేడాలను చక్కగా వివరించారు. ఇది చదువుతుంటే సమాజంలో మన ప్రవర్తన ఎలా ఉందో అర్థమవుతుంది. చివరి పేజీ కథలో వ్యక్తి సామర్థ్యానికి అవయవ లోపం అడ్డు కాదని పుప్పాల కృష్ణమూర్తి చక్కగా చెప్పారు. శారీరక లోపాలున్న వాళ్లని కాస్త ప్రోత్సహిస్తే ఎలా ఉన్నత స్థాయికి ఎదుగుతారో ఈ కథ ద్వారా తెలుస్తుంది.

**ఇ.ఎస్.ఎన్, భీమనవారి పేట.**

## బాల కథ భలే

**చా**గంటి సోమయాజులు 'పాత కథ' బాగుంది. చిన్ననాటి సంగతులు పెద్దయ్యాక తలచుకుంటుంటే ఆ ఆనందమే వేరు. కొత్త ఉత్సాహం పొందడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి. గతంలో వచ్చే సినిమాలు సందేశాత్మకంగా ఉండేవి. అలాగే చరిత్రను తెలిపేవి, రాజుల కథలు ఆసక్తికరంగా తీసేవారు. ఇప్పటి సినిమాలు ఏ ఉద్దేశంతో, ఏం చెప్పడానికి తీస్తున్నారో అర్థం కావడం లేదు. మనిషికి నిత్యావసర ధరలు అందుబాటులోకి ఎప్పుడొస్తాయో కానీ పీసీ టాబ్లెట్లు మాత్రం చాలా చౌకగా వస్తున్నాయి. 'తెలుసుకుందామా'లో అభివృద్ధికి దిక్సూచి బాగుంది. పెట్టుబడిదారులు కంటికి కనపడరు. కానీ వారి అడుగుజాడల్లోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయి. చివరి పేజీలో 'మూగ చిత్రకారుడు' కథ బాగుంది. డబ్బు తీసుకుంటే ఖర్చయిపోతుంది. కానీ జీవనోపాధి లభిస్తే జీవితాంతం తోడుంటుంది.

**బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆముదాలవలస.**

## ఆసక్తికరం

**'ఎ**వరి గోల వారిదే'లో ఎం.కోటేశ్వరరావు చాలా మంచి సమాచారం ఇచ్చారు. అమెరికాలో విద్యారుణం పేరుతో యువకులు ఎంత వేదనకు గురవుతున్నారో చక్కగా చెప్పారు. ఒబామా బడ్జెట్ కోత ప్రభావం విద్యారుణ గ్రస్తులకు ఎలా భారమైందో వివరించారు. ఇంటర్నెట్ వ్యవస్థ కుప్పకూలిపోతుందని ప్రచారం చేసుకుని తద్వారా ఎలా వ్యాపారం చేసుకుంటున్నారో... విద్యార్థులకు ఉపయోగ పడేలా చెప్పారు. 'ఈ పేజ్'లో ఆకాశ్ పీసీ టాబ్లెట్ల ఉత్పత్తి, సాంకేతిక నిపుణుల గొప్పదనం. కొల్లి సత్యనారాయణ 'వియత్నాం' యాత్ర ఆసక్తికరంగా ఉంది. స్టీవ్‌జాబ్స్ వ్యాసం బాగుంది.

**కె. చంద్రమోహన్, హైదరాబాద్.**

## ఎప్పుడెప్పుడా!

**'అ**ట్టమీది కథ' బాగుంది. ప్రాచీన సంస్కృతికి గ్రీసు పెట్టింది పేరు. అటువంటి దేశానికి నేడు ఈ దుస్థితి రావడం బాధాకరం. 'మాటల కోట' ఎప్పుడెప్పుడు పూర్తి చేద్దామా అనిపించేలా ఉంటోంది.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## చిన్న దేశమైనా...

**'తె**లుసుకుందామా'లో వియత్నాం విషయాలు అలరించాయి. సామ్రాజ్యవాద దేశాలనెదిరించి, వారి ఎత్తులను చిత్తు చేసింది ఆ దేశం. హోచిమిన్ నాయకత్వంలో సోషలిస్టు దేశంగా ప్రగతి సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. చిన్న దేశమైనా సామాజిక స్పృహతో ముందుకు సాగడం ప్రశంసనీయం.

**నూతి నారాయణరావు, హైదరాబాద్.**



## చెక్కపకోడి

**కావలసిన పదార్థాలు**

శనగపిండి - 3 కప్పులు
బియ్యం పిండి - 2 కప్పులు
కరివేపాకు - 2 రెమ్మలు
పచ్చిమిర్చి - 8
అల్లం - చిన్నముక్క
ఉప్పు - తగినంత
వంటసోడా - చిటికెడు

**తయారు చేసే విధానం**

శనగపిండి, బియ్యం పిండి మిశ్రమంలో ఉప్పు, అల్లం పచ్చిమిర్చి



పేస్ట్, వంటసోడా, తుంచిన కరివేపాకు ముక్కలు కలపాలి. అందులోనే రెండు గరిటెల వేడినూనె పోసి బాగా కలపాలి. నీటితో పూరీ పిండిలా కలుపుకోవాలి. చక్రాలు చేసే గిద్దెలో వెడల్పు రంధ్రాలున్న ప్లేటు పెట్టుకుని నూనె రాసుకోవాలి. అందులో కలుపుకున్న పిండిని పెట్టుకోవాలి. గిద్దెల్లో పిండిని కాగిన నూనెలో ఒత్తుకోవాలి. చిన్న చిన్న కాజాల్లా నూనెలో పడతాయి. వీటిని దోరగా వేయించుకోవాలి. చెక్కపకోడీలు రెడీ. ఇవి వారం పదిరోజులు నిల్వ ఉంటాయి.

## అల్లం పకోడి

**కావలసిన పదార్థాలు**

అల్లం - 200 గ్రాములు,
శనగపిండి - అరకిలో
ఉల్లిపాయలు - అరకిలో
పచ్చిమిర్చి - 100 గ్రాములు
జీలకర్ర - 2 స్పూన్లు, ఉప్పు - సరిపడా
నూనె - వేయించడానికి సరిపడా

**తయారు చేసే విధానం**

అల్లం, పచ్చిమిర్చి పేస్ట్ చేసి అందులో నుండి రసం తీయాలి. ఈ రసాన్ని శనగపిండిలో కలపాలి. ఉల్లిపాయలు సన్నగా తరిగి శనగపిడి మిశ్రమంలో కలపాలి. అందులో జీలకర్ర, ఉప్పు కలిపి ముద్ద చేయాలి. బాగా కాగిన నూనెలో ఈముద్దని కొద్దికొద్దిగా చిదమాలి. వీటిని బంగారు రంగు వచ్చే వరకు వేయించితే అల్లం పకోడీ రెడీ.

## చెగోడీ

**కావలసిన పదార్థాలు**

బియ్యం పిండి - 3 కప్పులు
మైదాపిండి - 1 కప్పు
నెయ్యి - 50 గ్రాములు
వాము - అర స్పూను
కారం - 1 స్పూను
నూనె - వేయించడానికి సరిపడా
ఉప్పు - తగినంత

**తయారు చేసే విధానం**

బియ్యం కడిగి ఆరబెట్టి పిండి పట్టించాలి. గిన్నెలో 4 కప్పుల నీళ్లలో ఉప్పు వేసి మరగబెట్టాలి. బియ్యంపిండిలో మైదాపిండి, వాము, కారం, నెయ్యి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో మరగబెట్టిన నీళ్లు పోసి ముద్ద చెయ్యాలి. దీన్ని చిన్న చిన్న ఉండలు చేసుకుని రెండంగుళాల పొడవు తాళ్లలా చేసుకోవాలి. వీటిని గుండ్రంగా చుట్టి కాగిన నూనెలో వేయించుకోవాలి. అంతే రుచికరమైన చెగోడీలు రెడీ.





## సాల్ట్ బిస్కెట్లు

**కావలసిన పదార్థాలు**

మైదా - 2 కప్పులు, వెన్న - పావు కప్పు
బేకింగ్ పౌడర్ - 2 టేబుల్ స్పూన్లు
పాలు - 2 టేబుల్ సూన్లు
ఉప్పు - తగినంత

**తయారు చేసే విధానం**

మైదాలో బేకింగ్ పౌడర్, ఉప్పు, వెన్న కలపాలి. తర్వాత పాలు పోసి బాగా మెదపాలి. అవసరమైతే ఈ మిశ్రమానికి కొద్దిగా నీటిని చేర్చి ముద్ద చేసుకోవాలి. చిన్న వుండలు చేసుకుని చపాతీలా వత్తుకోవాలి. దీన్ని మనకిష్టమైన ఆకారంలో కట్ చేసుకుని ఓవెన్‌లో బేక్ చేసుకోవాలి. లేదా కేక్ కుక్కర్‌లో పెట్టి సన్న సెగమీద అరగంట ఉడకనిస్తే చాలు. సాల్ట్ బిస్కెట్లు తయార్. పిల్లలు వీటిని బాగా ఇష్టపడతారు.

## చెక్కలు

**కావలసిన పదార్థాలు**

బియ్యం పిండి - అరకేజీ
పెసరపప్పు - 100గ్రాములు
ఉప్పు - తగినంత
అల్లం - చిన్న ముక్క
పచ్చిమిర్చి - 10
జీలకర్ర - 2 టేబుల్ స్పూన్లు
వెన్న - 3 టేబుల్ స్పూన్లు
నూనె - వేయించడానికి సరిపడా



**తయారు చేసే విధానం**

పెసరపప్పు నానపెట్టుకోవాలి. బియ్యం పిండిలో నానిన పెసరపప్పు, ఉప్పు, అల్లం పచ్చిమిర్చిపేస్ట్, జీలకర్ర, వెన్న, తగినంత నీళ్లు చేర్చి ముద్దలా కలుపుకోవాలి. దీన్ని చిన్న చిన్న ఉండలు చేసుకుని పాలిథిన్ పేపర్‌పై పల్చగా వత్తుకోవాలి. వీటిని కాగిన నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించి తీసేయాలి.

**కవిత్వమ్**

# తోలు గుండె

గుడిలో... బడిలో
గంటవుంది!
మనిషిలోనూ
గుండె గంట అనుక్షణం
లయబద్ధంగా
కొట్టుకుంటూ వుంటుంది!
దేవుడిది రాతిగుండె!
కరుణా సముద్రుడని
పేరేగాని దేవుని
హృదయం స్పందించదు!
భక్తుల మొరలాలకించి
సాయపడని రాతిగుండె ఆయనది!
మనది కవాటాలతో
కూడిన తోలు గుండె
రక్తనాళాల ప్రసారంతో
స్పందిస్తుంది!
మనలను బ్రతికిస్తుంది!
దేవుడి గుండె పాషాణం!
కండరాల తోలు గుండెకు
ఎన్నెన్నో ప్రమోదాలు! ప్రమాదాలు!

దానికి ట్రబులొస్తే
లక్షలతో ఖర్చు
మోయలేని ఆర్థిక భారం!
ఓ దేవుడూ! నీకు చీకూచింతా లేదు
బ్రతుకు భయంలేదు!
ధైర్యం అధైర్యాలతో పన్లేదు!
తోలుగుండె ఇచ్చినందున
మాకెన్నో ఇక్కట్లు
సుఖ దుఃఖాలు...

వేదన రోదన...
ఈర్ష్య... కక్ష... వంటివే కాక
వంచన... ద్రోహం వంటి
దుర్గుణాలు సంక్రమిస్తున్నాయ్!
తోలు గుండె స్థానే
నీకు మల్లే రాతి గుండెను
ఇచ్చి ఉంటే... బుద్ధిజ్ఞానం లేక
నీతి నియమాలెరుగక
మమ్ము మించిన వారు

లేరని విర్రవీగక
మోసాలకు పాల్పడక
ద్రోహ చింతన లేక
నీకు మల్లే హాయిగ
సుఖంగ మనగలిగేవారం!
మాది తోలు గుండె కావున
అదెప్పుడు ఆగుతుందో
మమ్ము కాటికి చేర్చునోనని
ముందుగా గ్రహించలేకున్నాము!
మేము సద్గుణ సంపన్నులం కాము!
హాయిగ దర్జాగ బ్రతికేస్తున్నాం!
మాకూ ఇకపై రాతి గుండెను
ప్రసాదించి పుణ్యం కట్టుకో స్వామీ!
దేవుడు స్పందించి
భక్తుల మొరలాలకించి...
ఇకపై రానున్న కాలంలో
ఈ భువిపై హృదయంలేని
'మర'మనుషులే ఉంటారు!
అర్థం కాలేదా పిచ్చి భక్తులూ?
'రోబో'లు సంచరిస్తుంటాయ్!
మీరుండరు! నేనుంటాను!
అంచేత మీకు రాతి గుండెలను
ప్రసాదించలేనని గ్రహించండి!!

**- ఎస్.వివేకానంద**

# కష్ట జీవులు

ఆరుకాలం ఏవుసం జేసి
అడ్డగోలు ఎరువులు వేసి
అంగట్లోకి ధాన్యాన్ని తరలిస్తే
జల్లి పట్టాలి జల్లి అంటూనే
ఎండలో ఆరబెట్టమంటూ
చిన్న ముక్కల ధాన్యం తెచ్చారంటూ
వంకలెన్నో వెదికి వెదికి పలికి
క్వింటాలు ధర తగ్గించవట్టిరి
పత్రికల్లో ప్రభుత్వ ధర గాలికొదిలేసి
గవర్నమెంటు అనుమతి ఇవ్వలేదంటూ
చిత్ర విచిత్రాలతో
తూకం వేసి దండిగా దోచిరి
వాయిదాల చీటి చేతిలోబెట్టి

పక్షానికి కలువుమని కేకలేసిరి
ఇప్పుడే డబ్బులు అవసరమంటే
నెలరోజుల వడ్డీ గుంజి డబ్బులు చేతబెట్టిరి
ఇంటికెళ్లి పంట లెక్కతేల్చితే
రూపాయి కూడా మిగలపాయే
రైతన్నల బతుకులు ఛిద్రమాయే
పెట్టుబడులే కష్టమాయే
ఏవుసం అంటేనే రోతపుట్టే
అయినా నేలతల్లిని నమ్ముకున్న రైతన్న
చేత నాగలిబట్టి సాగు చేయవట్టి
ఇకనైనా రైతు ఘోష వినండి పాలకవర్గము
గిట్టుబాటు ధరతో లాభం అందివ్వండి అధికారవర్గము

**- ఉండ్రాల రాజేశం**

# హత్య

తల్లి కడుపులో ఉన్నప్పుడు
భ్రూణహత్య
బయటపడ్డాక
భౌతికంగా హత్య
పెద్దయ్యాక యాసిడు హత్య
పెళ్లయ్యాక వరకట్నపు హత్య
ఉపాధికై ఉద్యోగానికి వెళ్తే
వెకిలి చేష్టలతో మానసిక హత్య
ఏమిటీ ఘోరం మేము ఏమి చేశామని నేరం
ఆడబిడ్డగా పుట్టడమే నేరమా?

దీనికి లేదా ఏదీ పరిష్కారం
ప్రతి సమస్యకు ఉంటుంది పరిష్కారం
ప్రతి క్షణం ప్రయత్నించు
సమాజ మార్పుకై అన్వేషించు
నిన్ను నీవు రక్షించుకొనుటకై
వివక్షను వ్యతిరేకిస్తూ
ఒంటరిగా కాదు సుమా!
సంఘటితంగా, సంఘంగా
ఐక్యంగా సాగించు సమరం
సాధించు విజయం

**- జి.లలిత**

# SPEAK ENGLISH FLUENTLY

**6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.**

**తెలుగు తెలిస్తే చాలు...**

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

## రోజుకు ఒక గంట చాలు...

## సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

**కూపన్ పంపండి లేదా SMS పంపండి.**

**CHENNAI: 0-97890 99589**

పై సెల్‌ఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరిపేరు, ఫోన్ నెం., పిన్‌కోడ్‌లతో సహా వివరంగా మీ అడ్రసును SMS చేయండి. మా సెల్‌ఫోన్ 24 గంటలూ కంప్యూటర్‌కు లింక్ చేయబడి ఉంటుంది. మీ అడ్రసు ఆటోమేటిక్‌గా కంప్యూటర్ రిసీవ్ చేసుకుంటుందని తెలుసుకోగలరు. కోర్స్ ఫీజు రూ.1000/-లు. ఇది 5 నెలల కోర్స్. రోజూ ఒక గంట చదివితే చాలు. ఈ కోర్సులో 10 పుస్తకాలు, 1 CD ఉంటాయి. మీకు ఏమయినా సందేహాలు ఉంటే, లెటరు వ్రాసి తెలుసుకోవచ్చు. 10 రోజులలో పోస్ట్‌మేన్ కోర్స్ ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ మెటీరియల్ పొందవచ్చును. SMS పంపడానికి అవకాశం లేనివారు ఈ ప్రకటనలో ఉన్న కూపన్‌ను పూర్తిచేసి పంపండి.

**ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.**

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ..........................................................

Address: ......................................................

..........................................................Pin Code: ______

**ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు:** ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**93915 49930. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

**ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.**

కథ

# జ్ఞాపకాల బావి

- తెలకపల్లి రవి



"ఇక్కడే కూచుని కథలు చెప్పుకునేవాళ్లం. అప్పుడు ఇక్కడ తలుపు వుండేది. ముందు మెట్లు వుండేవి..."

మేము ఒక ఇంటి ముందున్న అరుగు మీద కూచుని వున్నాము. కొన్నేళ్ల కిందట మాదైన ఆ ఇంటి అరుగు అది. ఇప్పుడెవరుంటున్నారో గాని తలుపు వేసివుంది.

నేను చెబుతుంటే పిల్లలు ఆసక్తిగా వింటున్నారు. వాళ్ల మొహాల్లో కుతూహలం,

"ఇదిగో గోడకు ఈ మూలన కిటికీ... దాంట్లో కూచుంటే వచ్చి పోయే వారంతా అగుపిస్తుండేవాళ్లు. మధ్యాహ్నం తాతయ్య, నానమ్మ నిద్ర పోయేవాళ్లు. నాకు నిద్ర పట్టేది కాదు. ఇక్కడ ఏదో తింటూ ఆడుకుంటూ వీధిలోకి చూస్తూ కూచునేవాణ్ని.. "

"చదువుకునే వాడివి కాదా" అడిగాడు మా బామ్మర్ది చిన్న కొడుకు..

"ఆ చదివేవాణ్ని .. అప్పట్లో కరెంటు వుండేది కాదు గనక వీలైనంత ఎక్కువగా పగటిపూటనే చదివేసేవాళ్లం. త్వరగా పడుకునేవాళ్లం".

"మరి టీవీలో సీరియల్సు చూడరా?" మళ్లీ వాడే అడిగాడు.

"కరెంటు లేకుంటే ఎక్కడన్నా టీవీ వస్తుందా" ఇంకెవరో వాడికి జవాబిచ్చారు.

"కరెంటు ఎప్పుడూ పోతుందా" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"కాదు నాన్నా మా చిన్నప్పుడు అసలు లైట్లే వుండేవి కావు. ఇప్పుడు సినిమాల్లో, సీరియళ్లలో దీపాలు పట్టుకుని వెళ్తుంటారే. అలాటివే వుండేవన్న మాట.."

మాతో పాటు అయిదారుగురు పిల్లలున్నారు. చాలా కాలం తర్వాత స్వంత వూరికి వచ్చాము. అది కూడా హడావుడిగా. వ్యానులో పట్టినంత మంది ఎక్కారు. ముఖ్యంగా మా నాయనమ్మ కొన్నేళ్ల తర్వాత వూళ్లోకి వచ్చింది. ఆమెను తీసుకుని వ్యాను గుడి దగ్గరకు వెళ్లింది. మేము మాత్రం మా ఇల్లు వున్న చోటు పిల్లలకు చూపిస్తూ మరో దారిలో వస్తామని చెప్పాను.

◆◆◆

వూరి మొదట్లోనే ఎత్తయిన దిమ్మ మీద మా అయిదారు ఇళ్లు. అగ్ర వర్ణాలు వుంటాయి గనక ఎత్తున కట్టి వుండొచ్చు. కరణాలు, పురోహితుల ఇళ్లు. అక్కడకు రావాలంటే ఈ రోజున అపార్ట్‌మెంట్లలో ఒక ఫ్లోరు ఎక్కినట్టే. లేదంటే వూళ్లోనుంచి అటు తిరిగి రావాలి. అదైనా ఎవరంటే వాళ్లు ఈ వైపు రావడానికి వుండదు. కింది కులాల వాళ్లు, దళితులు మరో వైపు నుంచి తిరిగి పోవలసిందే గాని ఈ మెట్టు దిగి దగ్గర దారిలో వెళ్లడం నిషేధం. తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చినా చేత్తో చెప్పులు పట్టుకుని నడవాలి. ఇలా చాలా కాలమే నడిచింది. మా ముందు తరంలోనైతే అసలు వాళ్లు రావడమే నేరం. మా తరంలోకి వచ్చేసరికి అప్పుడప్పుడూ ఆంక్షలతో నడుస్తుండేవారు. తర్వాత ఆంక్షలు బొత్తిగా పోయాయి.

ఇప్పుడు ఆ పరిసరాలు నిర్జీవంగా వున్నాయి. కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. ఆ రోజుల్లో అన్నిటిలోకి ఘనంగా వెలిగిన ఇల్లే ఎక్కువగా పాడు పడిపోయింది. ఒక దిబ్బ వేసుకున్నారక్కడ.

ఆ ఇళ్లముందే ఒకప్పుడు అయ్యగార్లు. సాయింత్రం పడక్కుర్చీల్లోనో అరుగుపై మెట్లకో నడుములు ఆనించి ఆపసోపాలు పడుతుండే వారు. వీధిలో ఎవరైనా కనిపించడం పాపం, పిలిచి ఏదో ఒక పని పురమాయిస్తారు. లేదా ఏదో వాకబు చేస్తారు. ఆ చెప్పేప్పుడు కూడా దూరంగా నిలబడి మాట్లాడాలి. వినయం అభినయించాలి. ఒక పట్టాన వదలరు.

ఈ వ్యవహారాలన్ని ఎందుకని పని పాట చేసుకునేవాళ్లు. అటు కేసి రావడానికే విముఖంగా వుండేవాళ్లు.

◆◆◆

వీధి మధ్యలో చేదబావి. మంచి నీళ్లు దొరికే మూడింటిల్లో అదొకటి. అయితే అక్కడా అయ్యావార్లయ్యాకే ఇతరులు చేదుకోవాలి. రెండు చేదల్లో ఒకటి ఇతరులు ముట్టుకోకూడదు. మడి కట్టుకున్నవాళ్లు వస్తే కాస్సేపు ఆగాలి. కాదని చేద వేస్తే వాళ్ల కోప్పడతారు. విసుక్కుంటారు.

బావిలో నీళ్లు బాగా అడుగున వుంటాయి. గిలకపై చేదడానికి సత్తువ కావాలి. మాకు సైన్సులో చెప్పిన కప్పి పాఠం అక్కడకు వెళ్లినప్పుడల్లా గుర్తుకు వచ్చేది. చేదతాడు పడీ పడీ బావి గట్టుకున్న బండలు ఆరిగిపోయి నున్నగా తయారై తమాషాగా వుంటుంది. గాసగాళ్లు (పాలేర్లు) వస్తే ఒక్క ఉదుటున బలంగా తోడిపోస్తారు. వాళ్ల మోసే కడవలు కూడా అమ్మో ఎంత పెద్దగా వుండేవో! పైగా చేత్తో మరో బక్కెటో బిందో పట్టుకెళ్లేవాళ్లు. ఆవో గేదో అటు వైపు వస్తే పక్కనున్న తొట్టిలో నీళ్లు తాగుతాయి. గాసగాళ్లు వస్తే తప్పక ఒక కడవ దాంట్లో గుమ్మరిస్తుంటారు. ముసలీ ముతకా చేది పోసి భుజంపైకెత్తి పంపిస్తారు. ఆడవాళ్లయితే చంకలో బిందె పెట్టుకోవడం ఎక్కువ. వాళ్లలోనూ కొంతమంది బాగానే బరువు బిందెలు మోసేస్తుంటే చాలా ఆశ్చర్యంగా వుండేది.

చేదబావి నీళ్లకన్నా మాటలే వేగంగా వూరేవి. గబాగబా నాలుగు చేదలు ఎక్కువ పడితే తర్వాత వాళ్లు నీళ్లకోసం కాస్సేపు నిరీక్షించాల్సిందే. అప్పుడే మాటలు బాగా వూరేస్తాయి. వాళ్లమీద వీళ్లు వీళ్లమీద వాళ్లు ఎవరేమనుకుంటున్నదీ, ఏం కొంటున్నదీ అమ్ముకుంటున్నదీ అన్నీ వినిపిస్తాయి. స్నేహాలు కలిసేది, కలహాలు పెరిగేది కూడా అక్కడే.

ఎప్పుడైనా కోపతాపాలు ముదిరితే తెల్లవారేసరికి ఎవరో చచ్చిన పిల్లినో కుక్కనో నీళ్లలో పడేస్తారు. ఒక రోజంతా బావి పనికి రాదు. ఎవరు దిగి తీయాలనేది పెద్ద సమస్య. ఆ కథ ఎలాగో ముగుస్తుంది. బావిపైన పెత్తనం ఎవరిదనేది చెలాయించడాన్ని బట్టే ఒక్కోసారి ఒక్కొక్కరు. ఒక్కోసారి బావి మరీ పాడైపోయిందని గొడవ మొదలవుతుంది. అప్పుడు ఎవరైనా కుర్రాళ్లు లోపలికి దిగి పూడిక తీస్తారు. అప్పుడు బయిటకు వచ్చేది తాడుతో సహా జారిపడిన బిందెలు బక్కెట్లే కాదు, పిల్లలు వేసిన పళ్లాలు, గిన్నెలు, కొంతమంది పోగొట్టుకున్న వస్తువులు వగైరా..

పట్నం నుంచి వెళ్లి చూసే నా లాంటి పిల్లాడికి అంతా విచిత్రమే. చేదాలనే వుబలాటం వున్నా చేతులు కాస్సేపట్లో కంది పోతాయి. బొబ్బలెక్కుతాయి కూడా. వూళ్లోకి వెళ్లిన వారం రోజులకు గాని అలవాటు పడవు. ఈ లోగా ఇంట్లో పాలేరు తానే తెచ్చిపోస్తానంటూ వెళ్లనివ్వడు. వాడు చేదుతుంటే వూరికే వెళ్లి బావి పక్కన చూస్తూ నిల్చోవడం బాగుండదు. పైగా అలా నిలబడినప్పుడు ఎవరైనా ముసలమ్మ వచ్చి కాస్త చేదిపెట్టమని అడిగితే... చేతకాకపోతే మరీ పలచన. అంతకన్నా పెద్ద సమస్య- పల్లెటూరి అమ్మాయిలు అవలీలగా చేదిపారేస్తుంటే అబ్బాయిలమై ఆపసోపాలు పడటం తల కొట్టేసినట్టు వుంటుంది. ఇవన్నీ తప్పించుకోవాలంటే వీలైనంత తక్కువగా అటు వెళ్లాలి.

నానమ్మ వాళ్ల వూళ్లో చేదబావి కథ ఇలావుంటే అమ్మమ్మ వాళ్ల వూళ్లో బావి మరో తమాషా. కాస్త ప్రమాదం కూడా. ఆ వూళ్లో బావికి బండలు గిలక వుండవు. పైన దూలాలు వేసి వుంటాయి. ఆ దూలాలపై నిలబడి బిందెకు తాడు కట్టి చేత్తోనే చేదుకోవాలి. గిలక లాటిదేమీ వుండదు. అలవాటు లేనివాళ్లు ఆ దూలాలపై నిలబడి నీళ్లలోకి చూస్తే కళ్లు తిరుగుతాయి కూడా. మూర్ఛ వ్యాధి వున్న ఒకావిడ నీళ్లు చేదుకోవడానికి వచ్చి పడిపోవడం నేనెప్పటికీ మర్చిపోలేను. అక్కడ మేము చేదడం అసంభవం. ఎవరైనా చేదిపోస్తే ఇంట్లోకి మోసుకురావడమే. ఈ వూరికి వచ్చినప్పుడల్లా దాని గురించి కబుర్లు చెప్పేవాణ్ని. తెలిసింది అదే గనక.

మేము స్కూలు ఫైనల్‌కు వచ్చేసరికి వూళ్లోకి నెమ్మదిగా పంపులు రావడం మొదలైంది. వూళ్లో మొదటి కుళాయి పడిన రోజైతే పండుగే! దానికి పూజలు చేశారు. ఒక రోజు గడిచినా పంపు దగ్గర బిందెల వరస తగ్గలేదు. తర్వాత రెండు మూడేళ్లలో నెమ్మదిగా వూళ్లో మరి కొన్ని చోట్ల పంపులు పెట్టారు. జనం అలవాటు పడ్డారు. బావుల రద్దీ తగ్గింది. అయితే కరెంటు రాని రోజు, నీళ్లు వదలని రోజు ఒక్కసారిగా బావుల దగ్గర కిటకిటే.

బావిలో నీళ్లలాగే వూరే ఈ జ్ఞాపకాలు అన్నీ కాకున్నా చాలా వరకూ పిల్లలకు చెబుతూనే వుంటాను. అవన్నీ విన్నారు గనకే ఇప్పుడు బాగా హుషారుగా వున్నారు. నెమరు వేసుకున్నట్టుగా అవి మళ్లీ అడగడం మొదలెట్టారు

◆◆◆

మేము అరుగు మీద కూచుని వుండగానే వూరి వాళ్లు నెమ్మదిగా వచ్చి పలకరించడం మొదలుపెట్టారు. సందడి పెరగడంతో మా ఇల్లు కొన్నవాళ్లు వచ్చి తలుపు తీశారు. మేమెవరో అర్థం కానట్టు మొహం పెట్టారు. అయితే కొద్ది క్షణాల్లోనే. తెలిసిపోయింది.

"బయిట కూచున్నారెందుకు, ఇంట్లోకి రండయ్యా" అని గౌరవంగా ఆహ్వానించారు.

ఒకప్పుడు అమ్మేసిన ఇంట్లోకి వెళ్లి ఇది



మనదేనని చూసుకోవడం ఏమంత వాస్తవికంగా వుంటుంది? దాని వల్ల ప్రయోజనం ఏముంటుంది? పైగా వాళ్లు పడగొట్టి మరీ కట్టించారు. నిజం చెప్పాలంటే దాన్ని అమ్మడానికి నాన్న చెప్పిన కారణమే అది.

"ఇల్లు పడిపోయేట్టుంది. మనం మళ్లీ భారీగా ఖర్చు చేసి తిరిగి కట్టించాలి. లేదా ఎవరికైనా అమ్మేసేయాలి." అన్నాడు

అప్పటికే ఆయన హయాంలో వున్న ఆస్తులన్నీ అమ్మేసుకున్నారు. సంపాదన అన్న ఆలోచన లేకుండా ఉద్యమాలలోనే తలమునకలయ్యే వారెవరికైనా తప్పని స్థితి అది. దానిపై ఇప్పుడేమీ విచారం లేదు. కాకుంటే ఆ అమ్మిన ఇంట్లోకి వెళ్లి పాత వ్యామోహాలు గుర్తు చేసుకోవడమెందుకు?

"ఫర్వాలేదమ్మా.. మేము ఈ అరుగుపైన కూచునేవాళ్లం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఇక్కడ గడిపాం. చాలు.. "అని చెప్పేశాను.

"తాగడానికి నీళ్లు తీసుకొస్తా"నందామె. వారించాను. అప్పటికే పిల్లల చేతుల్లో రెండు బాటిల్స్ వున్నాయి. ఆ వూళ్లో చిన్నప్పుడు నారి కురుపు బాగా వ్యాపిస్తుండేది. ఎవరి కాళ్లకు చూసినా కట్టు.. రసి కారుతుండేది. దిగుడు బావుల దెబ్బ. అందువల్లనే ఇంతకు ముందు చెప్పుకున్న చేదబావికి అంత ప్రత్యేకత.

ఆమె నీళ్లు తెస్తాననగానే ఇవన్నీ నాకు మదిలో మెదిలాయి. నా కన్నా ముందు పిల్లలకు నేను చెప్పిన బావి కథలు గుర్తొచ్చినట్టున్నాయి.

"నాన్నా బావి చూద్దాం.." అన్నారు మెల్లగా నా చెవిలో..

"ఔను, నీళ్లు కూడా అక్కడే తాగుదాం" అని చిన్నాడు అన్నాడు.

నాకూ ఉత్సాహం వచ్చింది. ఆమె దగ్గర సెలవు తీసుకుని లేచాం.

వందగజాలు నడిస్తే కూడలి. అక్కడ వీధి లైటు. ఒకప్పటి పంచాయితీ లాంతరు స్తంభం కూడా దాని పక్కన అలానే వుంటుంది. ఒక మూలన బావి.

పిల్లలు హుషారుగా పరుగెత్తారు. నేను అన్నీ నెమరేసుకుంటూ కాస్త నెమ్మదిగా నడుస్తున్నా.

ఇంతలో వెళ్లిన వాళ్లు అంత కన్నా వేగంగా తిరిగొచ్చారు.

"చేదబావి ఎక్కడ?" అని ప్రశ్నలు కురిపించారు.

"ఇక్కడే అన్నాగా," కాస్త విసుగ్గా బదులిచ్చాను.

"అక్కడ ఏ బావి లేదు.." అన్నారు వాళ్లు..

"పదండి చూపిస్తాను" అంటూ నడక పెంచాను.

అయితే వాళ్లు సరిగ్గానే చెప్పారు.

అక్కడ చేదబావి లేదు.

పూర్తిగా పూడ్చేశారు. కొత్తవాళ్లకు ఏమీ అర్థం కాదు బావి వుండగా చూసిన వారికి మాత్రం నాలుగు వైపులా రాళ్లు, కొన్నిగుర్తులు కనిపిస్తాయి..

ఒక్కసారిగా నా జ్ఞాపకాలు తలకిందులైనట్టయింది. వూరు అనుకోగానే గుర్తుకు వచ్చే బావి మాయమైంది. నా ఆలోచనల్లో వుంది గాని వాస్తవంగా లేదు.

గతం గురించిన మన ఆలోచనలు ఎంత అవాస్తవంగా వుంటాయి?

గతం అలాగే వుంటుందనుకుంటారు, వుండాలనుకుంటారు కొందరు.

కాని వుండదు.

వర్తమానమే వుంటుంది.

నా బాల్యంలోని బావి..

నా పిల్లల బాల్యం వరకూ అలాగే వుండటం జరగదు. స్వంతమైతే- కావాలని అట్టిపెట్టుకుంటే తప్ప..

వూళ్లో కుళాయిలు వచ్చాక.. చేదబావి నీళ్లు కష్టపడి తోడుకోవలసిన అగత్యం వుండదు.

పైగా- ఏ కుటుంబాల కోసం కులాల కోసం ఆ బావి ఏర్పడిందో ఆ అవశేషాలు తప్ప ఆ వైభవాలు, పెత్తనాలు ఇప్పుడు లేవు.

బావిని పూడ్చడం కాదు- ఆ భావాలను కూడా పూడ్చినట్టు అనిపించింది.

చూస్తే అక్కడ కొత్త మొక్కలు మొలుస్తున్నాయి. వాటిపై పూలు పూస్తున్నాయి.

గతం పోయింది.వర్తమానం పుష్పిస్తున్నది.

◆◆◆

ఇవన్నీ అర్థంకాని పిల్లలు నాకేసి ప్రశ్నార్థకంగా చూస్తున్నారు.

బావి పూడ్చేశారని నీకు తెలియదా? అన్నట్టున్నాయి ఆ చూపులు.

"నేను చాలా ఏళ్లుగా రాలేదు కదా, అందుకే తెలియదు.."వాళ్లు అడిగినట్టే అనుకుని చెప్పాను.

వాళ్లేమంత బాధపడినట్టు కనిపించలేదు గాని నా మొహంలోకి అదే పనిగా చూశారు. పెద్దవాళ్ల ముఖ కవళికలు గమనించడం బుద్ధిశాలులైన పిల్లలకు ఒక సరదా.

"నీ బావి లేదని ఫీలవుతున్నావా?" చిన్నోడు అడగనే అడిగాడు.

"అబ్బే అదేం లేదు. పదండి వెళదాం" అని బయిలుదేరదీశాను.

గతం నుంచి వర్తమానం మీదుగా భవితలోకి నడుస్తున్నట్టు అనిపించింది.

★

ఎవరి గోల వారిదే

# పోయేదేముంది బొర్ర తప్ప...

'**ముం**దుకొచ్చిన బొ[్ర వెనక్కు పొడుచుకొచ్చిన పి[్ర' అంటూ ఒక రచయిత గతంలో స్వాములవార్ల తీరుతెన్నుల గురించి వర్ణించారు. అలాంటి వారందరూ కవుల నుంచి తప్పించుకోవాలంటే ఇప్పుడు ఎంచక్కా ఐరోపా దేశాలకు వెళ్లవచ్చు. ఎందుకంటే అక్కడ అలాంటి 'వాటిని' తొలగించేందుకు ఆపరేషన్లను అవలీలగా చేసి పారేస్తున్నారట. 'బీమా ఉన్న పేషెంట్లారా మీకు పోయేదేముంది అదనంగా ఉన్న బొ[్ర తప్ప' అంటూ భరోసా ఇస్తూ... అవసరం ఉన్నవీ లేనివి డజన్ల కొద్దీ మందులు రాస్తూ, ఆపరేషన్లు కూడా చేస్తున్నారట. అక్కడే ఏమిటి? ఇక్కడ తక్కువా అంటున్నారా? ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోయింది. లక్షలకు లక్షలు పోసి మెడికల్ కాలేజీల్లో సీట్లు కొనుక్కొంటున్నవారు, వారినీ వీరినీ చూసి డబ్బుయావలో పడి సేవా ధర్మం మరచినవారు ఎక్కడైనా చేసే పని అదే. పరిస్థితులు సజావుగా ఉన్నప్పుడు ఎన్ని అక్రమాలు జరిగినా ఎంత ఖర్చయినా పాలకవర్గం తన లాభాలకు భంగం కలగనంతవరకు దేనినైనా సహిస్తుంది. ఇప్పుడు ఐరోపాను సంక్షోభం కుదిపివేస్తోంది. అందువలన పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తల లాభాలు తగ్గకుండా చూసేందుకు చేస్తున్న అన్వేషణలో వైద్యుల అక్రమాలు కూడా బయటకువచ్చాయని వేరే చెప్పనవసరం లేదు. జర్మనీలో ఐదింట నాలుగు అలాంటి ఆపరేషన్లు అవసరం లేనివే అని గుంథెర్ లెయినర్ అనే ఐరోపా హెల్త్ ఫోరం నిర్వాహకుడు వాపోయాడు. ప్రతి లక్షమందిలో పోలాండ్‌లో 39 మంది పి[్ర ఆపరేషన్లు చేయించుకుంటుంటే జర్మనీలో 289 మంది ఏమిటి? వారికి నిజంగా అంత 'ఎక్కువ'గా ఉన్నాయా? ఎక్కడో తేడా ఉంది అంటున్నాడు. సాల్‌బర్గ్ వైద్య విశ్వవిద్యాలయం అధ్యయనం ప్రకారం సగటు వయస్సు 82 ఉన్న రోగులకు రాస్తున్న మందుల్లో 36శాతం అనవసరమైనవట. ప్రపంచ ఆరోగ్య సంస్థ సమాచారం ప్రకారం ఏటా 70 లక్షల మంది ఆపరేషన్ల సంబంధమైన సమస్యలతో ఇబ్బందులు పడుతుండగా వారిలో సగం మందికి అనవసరంగా చేసినవేనట. ప్రపంచంలో ప్రజారోగ్యం పేరుతో చేస్తున్న ఖర్చులో 97 శాతం చికిత్సలకు పోతుంటే కేవలం మూడుశాతమే నిరోధచర్యలకు అవుతున్నదట. రోగాలను నిరోధిస్తే ఆసుపత్రుల వ్యాపారం ఎలా సాగుతుంది భలేవారే !

**అత్యాశకు అనకాపల్లి...అమెరికా ఒక్కటే !!**

అనకాపల్లివారు వేరే అనుకోవద్దు. ప్రాసకోసం అని అర్థం చేసుకోవాలి. మీకు లక్ష డాలర్ల లాటరీ తగిలింది ఎవరికీ చెప్పకుండా మమ్మల్ని సంప్రదించండంటూ ఇమెయిల్స్, ఫోన్స్ వస్తున్న విషయం తెలిసిందే. ఇదే అమెరికాలో కూడా జరుగుతోంది. ఏమిటీ జనాలకు ఇంతటి అత్యాశ అంటూ ఇలాంటి కేసులతో అక్కడి ఎఫ్‌బిఐ తలపట్టుకుంటోంది. ఫ్లోరిడా రాష్ట్రానికి చెందిన ఒక మహిళకు ఒకరోజు వచ్చిన ఫోన్ కాల్‌తో ఒక వ్యక్తికి రెండులక్షల 25వేల డాలర్లు సమర్పించింది. ఎందుకటా తన దగ్గర బంగారు ఖనిజం చాలా ఉంది, చౌకగా యిస్తా, కొని శుద్ధి చేయించుకొంటే ఎంతో లాభం అని చెప్పాడట. ఒక గోడవున్ దగ్గరకు తీసుకు వెళ్లి ఇదే ఖనిజం అని డబ్బాల్లో ఉన్న ఇసుక, గులకరాళ్ల మిశ్రమాన్ని కూడా చూపాడట. నిజమే అనుకొని ఎంతకాలం గడిచినా బంగారం ఇవ్వకపోయే సరికి పోలీసులకు ఫిర్యాదు చేస్తే అసలు బండారం బయట పడింది. ఇలాంటి అమాయకుల నుంచి డబ్బు తీసుకొని జల్సాలు చేయటమే అతగాడి వ్యవహారం అని తేలి కటకటాలపాలయ్యాడట. కాకి బంగారం కోసం కాసులు పోగొట్టుకొని పరువు కూడా తీసుకోవటం ఎందుకు అనుకొని డబ్బు పోగొట్టుకున్నవారు మన దగ్గర బయటకు చెప్పుకోలేరు.

**సొమ్ము పోయే... శని పట్టే ?**

మామూలు వ్యవహారం కాదట? కార్పొరేట్‌ల అంతర్జాతీయ కుంభకోణం అని చెబుతున్నారు. కథేమిటో చూద్దామా. రోగులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వటం ఎలా అని 1894లో అమెరికాలోని మిచిగాన్ సెవెంత్ డే ఎడ్వంటిస్ట్ వైద్యుడు జాన్ కెల్లాగ్ ఆలోచించి ధాన్యాన్ని వండి వాటిపై పొట్టు తీసివేసి పెట్టించాడు. దాంతో కారన్ ఫ్లేక్స్, రైస్ క్రిస్పీస్ రంగంలోకి వచ్చాయి. అయితే కెల్లాగ్ సోదరుల మధ్య వ్యాపార విబేధాలు వచ్చాయి. దాంతో వేరు పడి సోదరుడు ధాన్యానికి పంచదార అద్ది కొత్త ఉత్పత్తి అంటూ అమ్మటం మొదలు పెట్టాడు. తరువాత ఏమైందో మీరు ఊహించుకోవచ్చు.

అమెరికాలో కార్న్ ఫ్లేక్స్ రాకముందు ఉదయమే ఉపాహారమంటే మా మామయ్య మాదిరి ఒక కంచం ఉప్మాతో పాటు మరో కంచం భోజనం కూడా వెంటనే లాగించి పొలం పనికి వెళ్లినట్లుగా 4000 క్యాలరీల శక్తి నిచ్చే ఆహారం తీసుకొనే వారట. మళ్లా మనం దారి తప్పుతున్నాం. రోగుల ఆరోగ్యం కోసం తయారు చేసిన వాటికి పంచదార, ఉప్పు వంటి వాటిని జతచేసి పెద్దలతో పాటు పిల్లలకూ రుచికరంగా ఉండేట్లు తయారు చేసి వాటితో ఆరోగ్యం స్థానంలో వ్యాపారం చేయటం ప్రారంభించారు. తరువాత ఫ్లేక్స్‌కు నారింజ రసం తోడై నిత్యావసరంగా మారిపోయింది. ఇంక చెప్పేదేముంది. వాటిని కొనుగోలు చేసేందుకు జనానికి ఆ వస్తువులతో పాటు ఎలాంటి రసాయనాలు జతచేయని, తాజా, స్వచ్ఛమైన సరుకంటూ ప్రకటనదారులు తయారు చేసే కట్టుకథలు ఉచితంగా అందచేస్తారు. ట్రోపికానా మన మార్కెట్‌లో కూడా దొరుకుతోంది తెలుసు కదా. పెప్సీ కంపెనీ ఉత్పత్తి అది. అరిసెలు, సున్నుండలు, చలిమిడి, కారప్పూస వంటివాటిని తినేవారిని అనాగరికులుగా చూసే వారు ఉన్నారంటే తప్పు వారిది కాదు. కార్పొరేట్ కంపెనీలు, వాటికి వంతపాడే మీడియాదే. పాతసినిమాల్లో అరిసెలు, కారప్పూస, పకోడీలు దర్శనమిస్తే గోదావరి వంటి కొత్త సినిమాల్లో హీరో హీరోయిన్ మధ్య విదేశీ కంపెనీలు తయారు చేసిన బంగాళాదుంపల చిప్స్ వచ్చాయి. సినీతారల అభిమానులది కూడా అదే బాట! మెక్‌డోనాల్డ్, బర్గర్ కింగ్స్, డోమినోస్ వంటివి ఇప్పుడు ప్రపంచాన్ని ఏలుతున్నాయి. వాటి నుంచి డబ్బిచ్చిమరీ మనం అనారోగ్యాన్ని కొనుగోలు చేస్తున్నాం. అవే కంపెనీలు ఆసుపత్రులు, డ్రమ్ముల్లా తయారైన వారిని స్లిమ్ముగా మార్చే బ్యూటీక్లినిక్కులు, ఊబకాయం తగ్గించే యంత్రాల వంటి వాటిని కూడా తయారు చేసి ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అని మరీ అమ్ముతున్నాయి. సొమ్ము పోయె శని పట్టే అంటే ఇదేనా ?

**- ఎం. కోటేశ్వరరావు**

# నవ్వుల్ - పువ్వుల్

## నిర్వాకం

**ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసు అధికారి భార్యాభర్తలను విచారించసాగాడు.**

**పోలీసు అధికారి:** ఏమ్మా మీరు ఇంట్లోనే ఉన్నారంటున్నారు. ఆ సమయంలోనే దొంగతనం జరిగిందంటున్నారు. బీరువాల్లోని సామాన్లన్నీ చిందరవందరగా పడవేస్తుంటే గ్రహించలేకపోయారంటే నమ్మటానికి వీలు లేదు. మీకు తెలిసినవారే ఈ పనిచేసి ఉండాలి, నిజం చెప్పండి.

**భార్య:** (ఎట్టకేలకు నోరు పెగల్చుకొని) లేదండీ...(ఒక్క క్షణం ఆగి...) నిజం చెప్పమంటారా. ఎప్పటి మాదిరే మా ఆయన పొద్దున్నే బట్టల కోసం వెతికి ఉంటారని అనుకున్నాను తప్ప దొంగతనానికి వచ్చిన వాడి పనిలా అనిపించలేదండీ...

## విషాద గాథ

**న**లుగురు స్నేహితులు ఒక పార్టీకి వెళ్లారు. పొద్దుపోయిన తరువాత హోటల్ నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న తమ రూమ్‌కు సరదాగా నడిచే వెళదామనుకున్నారు. అయితే దారిలో ఒకరు జోక్స్, ఒకరు తమ జీవితంలో జరిగిన ఉదంతాలు, ఒకరు చిలిపి కథలు, చివరి వాడు విషాదకథ చెప్పాలని అనుకున్నారు. అప్పటి వరకు పార్టీలో తిన్నది అరిగిపోయేలా నవ్వుతూ, తుళ్లుతూ వచ్చిన వారు నాలుగోవాడి కథ చెప్పమన్నారు. ఇది నిజంగా విషాద కథేరా మన రూమ్ తాళం చెవులు పార్టీలో ఎక్కడో పారేశాను అన్నాడు. అంతే !

## ఆదాము సూటు



**ఒ**క కుర్రవాడు ఒక రోజు వాళ్ల ఇంట్లో బీరువాలు వెతుకుతుండగా ఒక పాత బైబిలు దొరికింది. పేజీలు తిప్పుతుంటే మధ్యలో ఒక ఎండుటాకు కనిపించింది. వెంటనే ఉత్సాహం పట్టలేక అమ్మా నేనేం కనుగొన్నానో తెలుసా అన్నాడు.

అర్థంగాని తల్లి చేస్తున్న పని ఆపివేసి ఏం కనుగొన్నావేమిటి? అంటూ వచ్చింది.

బైబిల్ నుంచి పడిపోయిన ఎండుటాకును చూపి 'ఆదాము సూటు' అన్నాడు.

## వీలునామా !!

**కు**క్క కరిచింది డాక్టారూ అంటూ కంగారుగా ఒక వ్యక్తి ఆసుపత్రికి వచ్చాడు.

డాక్టరు పరీక్షలు చేసి నీకు రేబిస్ వ్యాధి సోకింది. ఇది చాలా ప్రమాదం అని చెప్పేందుకు బాధ పడుతున్నా అన్నాడు.

ఆ వ్యక్తి వెంటనే అయితే నాకు ఒక కాగితం, పెన్ను ఇప్పించండి డాక్టారూ అన్నాడు.

ఏం విల్లు రాస్తావా? చికిత్స చేయవచ్చు ఫర్వాలేదు అన్నాడు డాక్టరు.

కాదు సార్. నేను కరవాల్సిన వ్యక్తుల పేర్లు రాసుకోవాలి అన్నాడా వ్యక్తి.

## నాన్న పాటలు

**ఆ** పిల్లలకు పడుకోబోయే ముందు అమ్మ లాలిపాటలు వినటం ఇష్టం. అయితే అవిడకు తీవ్రంగా జలుబు, గొంతు నొప్పి రావడంతో భర్త ఏవైనా పాటలు పాడి పిల్లల్ని నిదురబుచ్చమని చెప్పింది. తొలి రోజు అలాగే చేశాడు.

మరుసటి రోజు ఐదేళ్ల టింకూ మూడేళ్ల చెల్లి పింకీతో చెవిలో మాట్లాడుతూ చెల్లీ నాన్న పాట మొదలు పెట్టగానే నువ్వుకూడా నిదురపోయినట్లు నటించు, పాటలు ఆపేస్తాడు, తరువాత మనం ఎంచక్కా నిదురపోవచ్చు అన్నాడు.

## చూడలేను

**ఓ** అల్లరి కుర్రాడు పక్కింట్లో ఆడుకుంటూ అందమైన ఫ్లవర్ వాజ్‌ను పగలగొట్టాడు. వెంటనే ఇంటికి వచ్చి జరిగిందంతా చెప్పి ఇంకెప్పుడూ అలాంటి పనులు చేయనని బేలముఖం వేశాడు. కొడుకు పశ్చాత్తాపాన్ని చూసిన తల్లి పోనీలే నాన్నా ఆంటీకి మరొకటి కొనిద్దాం అంది.

వెంటనే కుర్రాడు, అవసరం లేదు మమ్మీ, పగిలి పోయిందానిని ఎంతో మోజు పడి కొనుక్కున్నానని, దాని స్థానంలో మరొకదానిని చూడలేనని ఆంటీ అంటుంటే విన్నాను, అందువలన మనమేమీ కొనక్కర లేదు అన్నాడు అమాయకంగా.

## వేతన పెంపుదల

**వే**తనాలు పెంచాలని యాజమాన్యం నిర్ణయించినట్లు మేనేజర్ చెప్పాడు తోటి సిబ్బందితో.

ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయేమిటి అన్నాడు ఓ కుర్రాడు.

మనం సరిగా ఎప్పటి నుంచి పనిచేస్తామో అప్పటి నుంచి అన్నాడు మేనేజర్.

**- సత్య**

ఈపేజ్

కంప్యూటర్‌తోపాటు ప్రాచుర్యం పొందుతున్న ఎలక్ట్రానిక్ డివైజ్‌లలో యుపిఎస్ ముఖ్యమైనది. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు, పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు పనికి అంతరాయం కలగకుండా వుండడాలంటే కంప్యూటర్‌కు విద్యుత్ సరఫరా నిరంతరం అందుతూ వుండాలి. విద్యుత్ సరఫరాను సక్రమంగా అందజేయడమేగాకుండా, విద్యుత్ ఆగిపోయినప్పుడు.. అది ఆగిపోయిన విషయాన్ని కూడా మనకు తెలియనంత వేగంగా విద్యుత్‌ను అందజేయగల ముఖ్యమైన పరికరం యుపిఎస్. విద్యుత్‌నుంచి కంప్యూటర్‌కు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నివారించడానికి యుపిఎస్‌ను వాడుతుంటారు. అసలు యుపిఎస్ అంటే ఏంటి? ఇందులో ఎన్ని రకాలున్నాయి? ఈ యుపిఎస్‌లో కీలకమైనది ఏది? దీనికి సంబంధించి మనం గమనంలో వుంచుకోవాల్సిన ప్రధానమైన అంశాలేమిటనేది ఈ వారం ఈపేజ్‌లో తెలుసుకుందాం.

# బ్యాకప్ అందించే యుపిఎస్

**కం**ప్యూటర్‌లోని సున్నితమైన ఎలక్ట్రానిక్ పరికరాలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా యుపిఎస్ రక్షణ కవచంలా పనిచేస్తుంది. కంప్యూటర్ మొదలుకొని టీవీ, రిఫ్రిజిరేటర్ వంటి డివైజ్‌ల కోసం స్టెబిలైజర్లను వాడుతుంటారు. కంప్యూటర్‌కు విద్యుత్ సరఫరా చేయడంలో స్టెబిలైజర్ కంటే యుపిఎస్ మన్నికగా వుండడం వల్లనే దీన్ని వాడుతుంటారు.

### యుపిఎస్ అంటే?

యుపిఎస్ – 'అన్ ఇంట్రప్టబుల్ పవర్ సప్లై'. కంప్యూటర్‌కు విద్యుత్‌ను సరఫరా చేస్తూనే బ్యాటరీలను ఛార్జ్ చేసుకుంటుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే మెయిన్స్ నుంచి యుపిఎస్, బ్యాటరీకి స్విచ్ ఆన్ అవుతుంది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతరాయంగా సరఫరా అందుతుంది. విద్యుత్ ఆగిపోయిన సమయంలో బ్యాటరీల ద్వారా విద్యుత్ సరఫరా అందుతుంది. విద్యుత్ వచ్చిన వెంటనే మళ్ళీ బ్యాటరీలనుంచి మెయిన్స్‌కు యుపిఎస్ స్విచ్ ఆన్ అయి, మెయిన్స్ నుంచి సరఫరా అవుతుంది. కంప్యూటర్‌కు కావాల్సిన విద్యుత్‌ను నేరుగా అందకుండా యుపిఎస్ నుండే అందించాలి. విద్యుత్‌లో సరఫరా హెచ్చుతగ్గులను ఇది నివారిస్తుంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో బ్యాటరీల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తుంది. బ్యాటరీ ద్వారా అందే విద్యుత్ వలన డేటాను సేవ్ చేసుకొని, బ్యాటరీ బ్యాకప్ సమయాన్ని బట్టి వర్క్ కొనసాగించడమా, అపివేయడమా అనేది నిర్ణయించుకునేందుకు అవకాశం వుంటుంది. యుపిఎస్ లేకపోతే విద్యుత్ ఆగిపోయిన వెంటనే సిస్టమ్ కూడా ఆగిపోతుంది. అప్పటి వరకు చేస్తున్న వర్క్ నిలిచిపోవడమేకాకుండా సేవ్ చేయని ఫైళ్లను కోల్పోతాము. అంతేకాదు... ఒక్కోసారి ఆ ఫైళ్ళు కరెప్ట్ అయ్యే అవకాశం కూడా వుంటుంది. వర్క్ చేస్తున్న ఫైళ్లే కాదు, కొన్ని సందర్భాల్లో ఓపెన్‌చేసి వున్న సాఫ్ట్‌వేర్స్ కూడా పనిచేయకుండా పోతుంటాయి. నిరంతరం విద్యుత్ కోతను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కంప్యూటర్లకు యుపిఎస్ వినియోగం తప్పనిసరి. మనం ఉపయోగిస్తున్న కంప్యూటర్‌ను బట్టి పలు రకాల యుపిఎస్‌లు అందుబాటులో వున్నాయి. వాటి సామర్థ్యాలను బట్టి బ్యాకప్ ఆధారపడి వుంటుంది. సుమారు 30నిమిషాల నుండి 7గంటలు అంతకంటే ఎక్కువ సమయం కూడా బ్యాకప్ అందజేయగల యుపిఎస్‌లు అందుబాటులో వున్నాయి. అయితే బ్యాకప్‌ను అందజేయడంలో బ్యాటరీలదే కీలకపాత్ర.

యుపిఎస్‌ల పనితనాన్ని బట్టి వాటిని మూడు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ఆన్‌లైన్ యుపిఎస్, రెండు ఆన్‌లైన్ యుపిఎస్. లైన్‌ఇంటరాక్టివ్ యుపిఎస్.

### ఆన్‌లైన్ యుపిఎస్

ఇది మెయిన్ సప్లై రెక్టిఫైర్/ బ్యాటరీ ఛార్జర్‌ను నిర్వహిస్తుంటుంది. డైరెక్టు కరెంట్ (డిసి) నేరుగా ఇన్వర్టర్‌కు బ్యాకప్‌ను అందజేస్తుంది. అవసరమైన సమయంలో ఎక్కువ కంప్యూటర్లను ఉపయోగిస్తున్నప్పుడు లోడ్ ఎక్కువగా వున్నప్పటికీ చక్కగా ఎసి (ఆల్టర్నేటివ్ కరెంట్)ని సప్లై చేయడానికి ఆన్‌లైన్ యుపిఎస్‌లు ఉపయోగపడతాయి. రెండు కంటే ఎక్కువ కంప్యూటర్లు వున్నప్పుడు దీన్ని ఉపయోగిస్తుంటారు. వీటి బ్యాకప్‌తోపాటు ధర కూడా ఎక్కువే.

### ఆఫ్‌లైన్ యుపిఎస్

ఆన్‌లైన్ యుపిఎస్ మాదిరిగా కాకుండా మెయిన్స్ నుంచి వచ్చే విద్యుత్ ఆగిపోయిన వెంటనే ఆఫ్‌లైన్ యుపిఎస్‌లు పనిచేయడం ప్రారంభిస్తుంది. సాధారణంగా మెయిన్స్ నుంచి విద్యుత్ సరఫరా ఆగిపోయిన వెంటనే ఈ రకం యుపిఎస్ పనిచేస్తుంది. ఇన్వర్టర్ బ్యాటరీ నుంచి బ్యాకప్‌ను అందజేస్తుంది. అయితేవీటి సామర్థ్యంతోపాటు ధరకూడా తక్కువగా వుంటుంది. వీటిని గృహ వినియోగానికి ఎక్కువగా ఉపయోగిస్తారు.

### లైన్ ఇంటరాక్టివ్ యుపిఎస్

ఆన్‌లైన్ యుపిఎస్‌కు, ఆఫ్‌లైన్ యుపిఎస్‌కు మధ్యేమార్గంగా ఇది పనిచేస్తుంది. ఇన్వర్టర్ మెయిన్ సరఫరాతో టచ్‌లో వుండి, విద్యుత్ సరఫరాను అందజేస్తుంది.

### యుపిఎస్‌లో కీలకం బ్యాటరీ

యుపిఎస్‌లో కీలకమైన భాగం బ్యాటరీ. యుపిఎస్ ధరలో సగం ధర బ్యాటరీ కోసమే వెచ్చించాల్సి వుంటుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ యుపిఎస్‌లకు ఎక్కువ సామర్థ్యం గల బ్యాటరీలను ఉపయోగించాల్సి వుంటుంది. తక్కువ రకం నాణ్యతగల బ్యాటరీలను ఉపయోగించడం వల్ల బ్యాకప్ సమయం తగ్గిపోవడంతో పాటు బ్యాటరీకి స్విచ్ అయ్యే ప్రక్రియలో ఆలస్యం జరిగే ప్రమాదం వుంది. అంటే యుపిఎస్ నార్మల్ పవర్‌మోడ్ నుంచి బ్యాటరీ మోడ్‌కు ట్రాన్స్‌ఫర్ కావడాన్ని స్విచ్ లేదా స్విచ్చింగ్ అంటారు. ఇది 5మిల్లీ సెకన్స్‌లోపే వుంటుంది.

మనం ఉపయోగించే పెరిపెరల్స్‌ను బట్టి యుపిఎస్‌ను ఎంపిక చేసుకోవాల్సి వుంటుంది. సాధారణంగా గృహాల్లో ఉపయోగించే కంప్యూటర్లకు 500విఎ (విఎ-వోల్ట్ అంప్స్) సామర్థ్యం కలిగి యుపిఎస్‌ను ఉపయోగిస్తే సరిపోతుంది. బ్రాండెడ్ యుపిఎస్‌లైతే రెండు సిస్టమ్స్ వరకు కనెక్ట్ చేసుకోవచ్చు. ఎక్కువ కంప్యూటర్లను ఉపయోగిస్తూ, బ్యాకప్ కూడా అవసరం అయితే ఆన్‌లైన్ యుపిఎస్‌లను ఉపయోగించాల్సి వుంటుంది. మనం ఉపయోగించే డివైజ్‌లు, యుపిఎస్ బ్రాండ్‌లను బట్టి ఎంత సామర్థ్యం గల యుపిఎస్‌లు అవసరమవుతాయో అంచనా వేసుకోవచ్చు. నాణ్యత గల బ్యాటరీలను ఎంపిక చేసుకోకపోతే, స్విచ్ ఓవర్ సమయం సరిగా లేకపోవడం, బ్యాకప్ సమయం తక్కువగా వుండడం, విద్యుత్ సరఫరా నిలిచిన వెంటనే బ్యాటర్ లోడ్ కన్వర్ట్ కాకపోవడం వంటి లోపాలు తలెత్తుతాయి. మంచి యుపిఎస్‌కు ప్రాణం నాణ్యమైన బ్యాటరీలు. అటువంటి వాటిని ఎంపిక చేసుకొని విద్యుత్ అంతరాయం వల్ల కంప్యూటర్లకు జరిగే నష్టాన్ని పూడ్చుకోవచ్చు.

### గమనించాల్సిన అంశాలు

- యుపిఎస్‌లు కనీసం ఒక సంవత్సరం వారంటీతో వుంటాయి. యుపిఎస్‌లను కొనుగోలు చేసే సమయంలోనే వారంటీ, బ్యాకప్‌ను చెక్ చేసుకోవడంతోపాటు వాటి నాణ్యతను గురించి కూడా తెలుసుకోవాలి.
- కొనుగోలు చేసే ముందు విఎ (వోల్ట్ అంప్స్) రేటింగ్ చూడాలి. సాధారణంగా 300విఎ సామర్థ్యం గల యుపిఎస్‌ను ఉపయోగించి ఒక కంప్యూటర్‌ను నిర్వహించవచ్చు.
- మెయిన్స్ విద్యుత్ నుంచి బ్యాటరీకి మారడానికి ఎంత సమయం పడుతుందనేది తెలుసుకోవాలి.
- యుపిఎస్‌లో లేటెస్ట్ టెక్నాలజీ గురించి తెలుసుకోవాలి.
- లోడ్‌లేని సమయంలో యుపిఎస్ స్లీప్ మోడ్‌లోకి వెళ్ళేలా వుంటే బ్యాటరీ డిస్‌ఛార్జి కాకుండా నివారించుకోవచ్చు.

**- కె.ఎక్స్.రాజు**

---

ఈన్యూస్

## అందంగా ఉన్నారో లేదో చెప్పేందుకో సాఫ్ట్‌వేర్

అందంగా ఉన్నామా లేదా అనేది తెలుసుకోవాలని ప్రతి ఒక్కరికీ వుంటుంది. ఎదుటివారు తమ అందం గురించి ప్రశంసిస్తే ఉబ్బితబ్బిబ్బవడం మానవ సహజం. తమ అందాన్ని అద్దంలో మరీమరీ చూసుకోవడం, తమ స్నేహితుల్ని అడిగి తెలుసుకోవడం సహజం. ఇక మీదట అందంగా ఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు ఇంతగా శ్రమపడాల్సిన పని లేదంటోంది బ్రిటన్‌కు చెందిన సెలక్ట్ మోడల్ మేనేజ్‌మెంట్ సంస్థ. ఐ ఫోన్ అప్లికేషన్ సాయంతో మీరు బ్యూటిఫుల్‌గా ఉన్నారా లేదా అన్నది ఠక్కున తెలుసుకోవచ్చుని చెబుతోంది. మోడల్ పొటెన్షియాలిటీ అనే ఐ ఫోన్ సాఫ్ట్‌వేర్‌తో ఇది సాధ్యమని చెబుతోంది. మొదటగా ఈ సాఫ్ట్‌వేర్ ముఖాన్ని స్కానింగ్ చేస్తుంది. ఆ తర్వాత వివిధ కోణాల్లో ఫోటోల్ని తీసుకుంటుంది. వయసు, ఎత్తు, ముఖం ఆకారం, జుట్టు రంగు, కళ్లతోపాటు మరికొన్ని వివరాలు అడుగుతుంది. ఇందులోని గోల్డెన్ రేషియో టెక్నాలజీ ఆధారంగా సదరు మనిషి అందంగా ఉన్నాడా లేదా అన్నది తేల్చేస్తుంది. 2400 ఏళ్లక్రితం గ్రీకులు, ఈజిప్షియన్లు ఈ టెక్నాలజీని ఉపయోగించారని సెలక్ట్ మోడల్ మేనేజ్‌మెంట్ సంస్థ చెపుతోంది.




## డ్యూయల్ స్క్రీన్స్

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఎల్‌జీ కొత్తగా మార్కెట్లోకి 'డ్యూయల్ స్క్రీన్ టెక్నాలజీ' స్మార్ట్ ఫోన్‌ని విడుదల చేయనుంది. ఎల్‌జీ విడుదల చేయనున్న డ్యూయల్ స్క్రీన్ టెక్నాలజీ మొబైల్ ఫోన్ పేరు ఎల్‌జీ డబుల్ ప్లే. ఈ మొబైల్‌కున్న మరో పేరే ఎల్‌జీ ఫ్లిప్ II. ఎల్‌జీ డబుల్ ప్లే స్మార్ట్ ఫోన్ గూగుల్ ఆండ్రాయిడ్ 2.3 జింజర్ బ్రెడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. చూడడానికి సింగిల్ మొబైల్ ఫోన్ మాదిరి ఉన్నప్పటికీ దీనిని స్లైడ్ చేసి చూస్తే మొబైల్ అభిమానులు ఈ మొబైల్ ఫోన్ డిజైన్ చేసిన ఇంజనీర్స్‌కి వావ్ చెబుతారు. ఫోన్‌ని స్లైడ్ చేస్తే దీనియొక్క ప్రైమరీ స్క్రీన్ టిఎఫ్‌టి టచ్ స్క్రీన్ డిస్ ప్లేతో పాటు స్క్రీన్ రిజల్యూషన్ 320×480 పిక్సల్స్‌గా రూపొందించారు. ఇక రెండవ స్క్రీన్ చిన్న సైజు క్వర్టీ కీప్యాడ్‌తో అలరిస్తుంది. ఖచ్చితంగా చెప్పాలంటే గతంలో నోకియా విడుదల చేసిన 'నోకియా ఎంగేజ్' మొబైల్ మాదిరే దీనియొక్క డిస్ ప్లేలు ఉంటాయి. ఎల్‌జీ డబుల్ ప్లే స్మార్ట్ ఫోన్ బరువు 99గ్రాములు. ఇందులో ఉన్న మైక్రో ఎస్‌డి స్లాట్ ద్వారా మెమరీని 32జిబి వరకు విస్తరించుకోవచ్చు. మొబైల్ వెనుక భాగాన 5మెగా పిక్సల్ కెమెరా సహాయంతో ఫొటోలతోపాటు వీడియో కూడా తీయవచ్చు. ఎల్ఈడి ఫ్లాష్ కెమెరా ప్రత్యేకం. డేటాని ఒక మొబైల్ నుండి మరో మొబైల్‌కి పంపేందుకు గాను బ్లూటూత్ అదనం. ఈ మొబైల్‌లో కమ్యూనికేషన్ టెక్నాలజీ వై-ఫై లేకపోవడం కొంత నిరాశ. మార్కెట్లో లభించే అన్ని రకాల ఆడియో, వీడియో ఫార్మెట్లను సపోర్ట్ చేస్తుంది. Li-Ion బ్యాటరీ ఇందులో నిక్షిప్తం చేయడం వల్ల బ్యాటరీ బ్యాక్ అప్ విషయంలో కూడా యూజర్స్‌కు చక్కగా సహకరిస్తుంది. సోషల్ నెట్ వర్కింగ్ వెబ్ సైట్స్ అయిన ట్విట్టర్, ఫేస్‌బుక్‌లను సపోర్ట్ చేస్తుంది. ఈ మొబైల్‌ని ఇండియాలో వచ్చే సంవత్సరం విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. ఇండియాలో దీని ధర సుమారుగా రూ 7,500గా ఉండొచ్చునని నిపుణుల అంచనా.

చూద్దామా




# మానస సరోవరం

**మానస సరోవరానికి వెళ్లే దారిలో అక్కడక్కడా కనిపించే బౌద్ధ ఆరామాలు, దూరంగా కొలువు తీరిన కైలాస శిఖరాన్ని వీక్షించడం... ఆ మధురానుభూతి చెప్పడానికి మాటలు చాలవు. ఈ యాత్రకు ఆరోగ్యం కూడా సహకరించాలి.**

మానస సరోవర యాత్రకు మొదటి మెట్టు నేపాల్. నేపాల్ నుండి బయలుదేరినప్పుడే మన రూపాయల్ని టిబెట్ కరెన్సీగా మార్చుకోవాలి.

ఈ యాత్రకు ఆరోగ్య పరంగా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఒక వారం పదిరోజులకు సరిపడా దుస్తులు, స్వెటర్లు కూడా తీసుకెళ్లాలి. ఇక దారి పొడవునా స్నాన గదులు అద్దెకు ఇస్తారు.

నేపాల్‌లో అడుగు పెట్టడానికి ముందు 'కొడారె' అనే ఊరు ఉంది. అక్కడే మానస సరోవర యాత్రకు సంబంధించి నిబంధనలన్నీ పూర్తిచేసుకోవాలి.

ఖాట్మండులో చూడాల్సిన ప్రదేశాలు పశు పతినాథ్ మందిరం, బుఢా నీలకంఠ మందిరం.. వెళ్లే దారిలో హిమాలయ పర్వత శ్రేణులు, లోయలు, జలపాతాలు కనువిందు చేస్తాయి. మధ్యలో నేపాల్‌లోని 'కోసి' నదిని దాటాలి. అక్కడ ఎటు చూసినా ఆకుపచ్చని ఎత్తైన పర్వత శ్రేణులు, దూరాన మిలమిల మెరిసే హిమ శిఖరాలే. అవి చూస్తుంటే ప్రయాణ బడలిక ఇట్టే మాయమవుతుంది.

టిబెట్ నుండి చైనా భూభాగంలో అడుగు పెట్టాలంటే 100 మీటర్ల పొడవైన బ్రిడ్జ్ దాటాలి. దీన్ని 'ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్' అంటారు. ఇది దాటుతుంటే భలేగా ఉంటుందిలే. కింద నురగలు కక్కే నీళ్లు ప్రవహిస్తుంటే... చుట్టూ ఎత్తైన కొండలు, వాటిపై పచ్చటి చెట్లు... ఆ ప్రకృతిని చూస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో రెండు దేశాల మధ్య వారధిని దాటడం మర్చిపోలేం.

అక్కడ్నుండి మానస సరోవరం చేరాలంటే ప్రత్యేకమైన ల్యాండ్ క్రూజర్లు ఉంటాయి. ఒక్కోదాన్లో నలుగురు కూర్చోవచ్చు. అది నడిపే డ్రైవర్లకు వారి మాతృభాష తప్ప హిందీ, ఇంగ్లీషు రాదు. మధ్యవర్తిగా ఒక నేపాలీ సహాయకుడు ఉంటాడు. మధ్యలో 'ఝూంగ్‌మూ' అనే టిబెట్ పట్టణం వస్తుంది. అక్కడ నరాలు వణుకుపుట్టించే చలి.

అక్కడ్నుండి 14 గంటలు కచ్చారోడ్డు మీద ప్రయాణం చేస్తే 'న్యాలం' అనే పట్టణం వస్తుంది. అక్కడ ఉష్ణోగ్రత చాలా తక్కువ. శరీరం ఆ వాతావరణానికి అలవాటు పడాలంటే కనీసం రెండు రోజులైనా అక్కడుండాలి.



'ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జ్'

అక్కడి చలిని తట్టుకోవాలంటే తల నుండి పాదాల వరకు పూర్తిగా ఉన్ని దుస్తులు ధరించాల్సిందే.

న్యాలం నుండి 232 కిలో మీటర్ల దూరంలో 'సాగా' ఎత్తైన ప్రదేశం ఉంది. ఇది సముద్రమట్టానికి 4200 మీటర్ల ఎత్తులో ఉంది. ఇక్కడ జడల బర్రెలు ఎక్కువగా కనిపిస్తాయి.

సాగాలో చలిని తట్టుకోవడం మరీ కష్టం. ఒకటికి రెండు స్వెటర్లు వేసుకోవాల్సిందే. పైన మళ్లీ ఓ రగ్గు కప్పుకునేవారూ ఉన్నారు. ఈ చలికి కొంతమంది అనారోగ్యం బారిన పడుతుంటారు. ఆ చలి బెడద నుండి రక్షించుకోడానికి ఎక్కడ ఎండ దొరుకుతుందా అని వెతుక్కుంటారు.

తర్వాతి మజిలీ 'పర్యాంగ్' అనే గ్రామానికి. ఇది సాగాకి 285 కిలోమీటర్ల దూరంలో, 4500 మీటర్ల ఎత్తులో ఉంది. దాని తర్వాతి వచ్చేదే మానస సరోవరం.

ఎండ ఎక్కువగానే వున్నా చుట్టూ వీచే చలి గాలులు వణుకు పుట్టిస్తాయి. అక్కడ్నుండి కైలాస శిఖరం చేరాలంటే నడిచి వెళ్లాల్సిందే. 'దార్చెన్' అనే కైలాస శిఖరపు అడుగు ప్రాంతానికి చేరాలంటే 60 కిలోమీటర్లు నడవాలి. అక్కడికి దగ్గర్లో యమద్వార్, అష్టపథ్ అనే దేవాలయాలున్నాయి. యమద్వార్‌లో ప్రదక్షిణ చేస్తే మరో జన్మ ఉండదని కొందరి విశ్వాసం. కైలాస పర్వతానికి ఎదురుగా ఉండే చిన్న గుట్టలాంటిదే అష్టపథ్. దాన్ని ఎక్కి చూస్తే ఎదురుగా కైలాస, నంది పర్వతాలు అద్భుతంగా కనిపిస్తాయి. ★

# సూర్యలంక

**మన రాష్ట్రంలో విహారం కోసం సముద్రతీరాలే కాదు, నదీ తీరాలూ బావుంటాయని గోదావరి ప్రాంత వాసులకి బాగా తెలుసు. వాస్తవానికి సముద్ర తీరం వెంబడి మనకు అందమైన బీచ్‌లు తక్కువే. వైజాగ్‌లో మినహాయించి అటు కాకినాడలో గానీ, ఇటు బందరులో గానీ చెప్పకోదగ్గ, చూడదగ్గ బీచులు, ప్రదేశాలు లేవు. కానీ మా ప్రయాణం మరో అందమైన తీరాన్ని చూపించింది. అదే సూర్యలంక. ప్రతి బీచ్‌లోనూ విపరీతమైన రద్దీ, వెంటపడి మరీ అంటగట్టే అమ్మకం దార్లూ... ప్రశాంతత తప్ప అక్కడ అన్నీ ఉంటాయి. కానీ సూర్యలంకలో అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది.**

---

ఇంకా పర్యాటకుల దృష్టి దీనిపై పడ్డట్లు లేదు. అందుకే ఇక్కడి ఇసుక, నీరు.. అన్నీ స్వచ్ఛంగా కనిపించాయి. బాపట్లలో రైలు దిగి కారులో సూర్యలంక వెళ్తుంటే బంగాళాఖాతంలో సూర్యోదయం దగ్గరికి వెళ్తున్న అనుభూతి. ఇంక అసలు అక్కడకి చేరాక మాత్రం ఆశ్చర్యమేసింది. అదేదో మన స్వంత తీరానికి చేరినట్లు, అదంతా అచ్చంగా మనకోసమే ఉన్నట్లు. అందుకు కారణం జన సంచారం ఎక్కువగా లేకపోవడమే. ఇక్కడ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ వారి బీచ్ రిసార్ట్ మాత్రమే (కొన్ని కాటేజీలు) ఉంది. ఆ కాటేజీలు తప్ప వేరే వసతి ఏర్పాట్లు లేవు. అందువల్ల వాళ్లు పెట్టిందే భోజనం. గుంటూరు కారం ఘాటు కాస్త ఎక్కువగా ఉన్నా రుచి పర్వాలేదనిపించింది. కళ్లెదుట కడలి ఉన్నా నది చేపలతో కూర! అయినా సముద్రానికి అతి దగ్గరగా కూర్చుని తినడం వల్ల ఆ



విషయం పక్కకు మళ్లింది.

తక్కువ జన సమ్మర్దం. నిండు ప్రకృతి, పూర్తి ప్రశాంతత సంపూర్ణంగా అనుభవించి, ఆనందించాలంటే సూర్యలంక సరైన ప్రదేశం. అయితే, క్రమక్రమంగా దీనికీ ప్రాచుర్యం పెరుగుతోంది. ఇంకొన్ని రోజుల్లో ఇదీ అన్ని బీచ్‌లలాగే కిక్కిరిసిపోతుందేమో!

బీచ్‌కి దగ్గర్లోనే భావనారాయణ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం దగ్గరున్న రెండు ఎత్తైన లోహ స్తంభాలు ఢిల్లీలోని కుతుబ్‌మినార్ కాంప్లెక్సులోని స్తంభాల్ని గుర్తు తెస్తాయి. బాపట్ల పట్టణంలో మరో చూడదగ్గ ప్రదేశం టౌన్‌హాల్. సుమారు వందేళ్ల చరిత్ర గల ఈ హాల్లో మహాత్మా గాంధీ (1920, 1929) ప్రజలనుద్దేశించి రెండు సార్లు మాట్లాడారట.

మేమున్న రెండు రోజులూ సూర్యలంకలోనూ, బాపట్ల టౌన్ హాల్లోనూ గడిపాం. బాపట్లకి దగ్గర్లో (25కిలోమీటర్లు) పదవ శతాబ్దంలో నిర్మించిన భావనారాయణ స్వామి సోదరుని ఆలయం, సహస్రలింగేశరస్వామి ఆలయం ఉన్నాయి. వాటిపై ఆసక్తి ఉన్నవారికి అవీ చూడదగ్గ ప్రదేశాలే. మాకు ఆసక్తీ, వీలు లేక సూర్యలంక నుండే వెనుదిరిగాం.

కనీసం ఒక రాత్రి బస చేసే వెసులుబాటుంటే సూర్యలంక మంచి ఆటవిడుపు ప్రదేశం.

**- యాజీవ్**


**ప్రజాశక్తి**

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

# సంక్రాంతి కథల పోటీ

సంక్రాంతి సందర్భంగా ప్రజాశక్తి సాహితీ సంస్థ కథల పోటీ నిర్వహించనుంది. రూ. 10,000 (ప్రథమ), రూ. 5,000 (ద్వితీయ), రూ. 3,000 (తృతీయ) పారితోషికం వుంటుంది.

**కథలు చేరాల్సిన ఆఖరు తేది**
**డిసెంబర్ 15, 2011**

**పాల్గొనే రచయితలకు సూచనలు :** ▶ కథలకు సమకాలీన పరిణామాలు, పరిస్థితులు నేపథ్యంగా ఉండాలి. ▶ ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ▶ ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకే ప్రాధాన్యం ఉంటుంది. ▶ మూఢనమ్మకాలను పెంచేదిగా కానీ, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా కానీ వుండకూడదు. ▶ మాండలికాలను ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధపడేలా వుండాలి. ▶ నవ్యత, వైవిధ్యం కలిగి ఇప్పటివరకు స్పృశించని కోణాలను ప్రతిబింబించే కథలకు ప్రత్యేక ఆహ్వానం.

**నిబంధనలు :** ◆ కథ నిడివి ప్రింటులో మూడు A4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో 8 నుంచి 12 పేజీలు వుండాలి. ◆ ప్రింటయినా, చేతిరాతయినా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండాలి. ◆ రచయిత/రచయిత్రి పేరు కథపై ఉండకూడదు. ◆ పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు, ఈ మెయిల్ ఐడి వేరే కాగితం మీద రాసి జత చేయాలి. ◆ హామీపత్రం విధిగా జత చేయాలి. ◆ కవరు మీద 'ప్రజాశక్తి కథల పోటీకి' అని స్పష్టంగా 'స్నేహ' డెస్క్, ప్రజాశక్తి దినపత్రిక, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్ - 500020

బహుమతి పొందిన కథలతో పాటు సాధారణ ప్రచురణకు కూడా కొన్ని కథలు స్వీకరించవచ్చు. ఈ కథలు ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో ప్రచురితమవుతాయి. అలా ప్రచురించే కథలకు సాధారణ పారితోషికం వుంటుంది. అనుభవజ్ఞులైన ప్రముఖ రచయితలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఈ పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై ప్రజాశక్తి సాహితీ సంస్థదే తుది నిర్ణయం.

**వి. కృష్ణయ్య,** చైర్మన్, ప్రజాశక్తి సాహితీ సంస్థ

# మరో గ్లో'బలి'

మొన్న ఇరాక్... నిన్న ఆఫ్ఘనిస్తాన్... నేడు లిబియా...

ప్రపంచ రక్షకుడిగా చెప్పకుంటున్న అమెరికా తాజాగా లిబియాను భక్షించింది. ప్రపంచ పోలీసు అవతారమెత్తి తనకు ఎదురు తిరిగే దేశం పాలిట విలన్‌గా మారడం అమెరికా ఆనవాయితీ. ఆ ఆనవాయితీని నిజం చేస్తూ 42 ఏళ్లుగా తన కంట్లో నలుసుగా ఉన్న లిబియా అధినేత కల్నల్ గడాఫీని పాశవికంగా వెంటాడి, వేటాడి హత్య చేసింది. గ్లోబలీకరణ... ప్రపంచీకరణ పేరుతో మరో గ్లో'బలి'కి పాల్పడింది. లిబియాలో ఉన్న అపార చమురు సంపదపై కన్నేసిన అమెరికా దాని మిత్ర పక్షాలు ఆ దేశాన్ని కబళించాయి. అంతటితో ఊరుకోకుండా ఆ దేశాన్ని ఎప్పటికీ తన చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు అధ్యక్షుడు గడాఫీని బలి తీసుకుంది.

- ఎం.డి.హసన్ షరీఫ్

తమ దేశంలోని ఆర్థిక మాంద్యం, నిరుద్యోగాన్ని పరిష్కరించలేని అమెరికా ప్రపంచంలోని ఇతర దేశాల సమస్యలను పరిష్కరిస్తానని బయలుదేరింది. మానవ హక్కులను కాపాడతాననే నెపంతో తనకు కంటగింపుగా ఉన్న దేశాలపైకి బాంబుల వర్షం కురిపిస్తూ లక్షలాది మందిని బలి తీసుకుంటోంది. అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించిన లిబియా అధ్యక్షుడిగా గడాఫీని నాటో దళాల ముసుగులో అదును చూసి చంపేసింది. అంతటితో ఊరుకోకుండా ప్రపంచంలోనే అతి నాణ్యమైన చమురు సంపదను కొల్లగొట్టడానికి రంగం సిద్ధం చేసింది. 42 ఏళ్లుగా చెప్పుకోదగ్గ జీవన ప్రమాణాలతో విలసిల్లుతున్న లిబియన్లను తన చెప్పుచేతల్లో ఉంచుకోవడానికి ప్రణాళిక రచించింది. 27 ఏళ్లకే అధికారం చేపట్టి 42 ఏళ్లు అప్రతిహతంగా పరిపాలించిన గడాఫీ లిబియాను ఆఫ్రికాలోనే అత్యంత ధనిక దేశంగా నిలిపాడు. 1969లో రక్తపాత రహిత తిరుగుబాటుతో ఈ పోలీసు అధికారి లిబియా గద్దెనెక్కాడు. యునెస్కో లెక్కల ప్రకారమే లిబియాలో అక్షరాస్యత శాతం 83. యువకుల్లో 99.9 శాతం మంది అక్షరాస్యులు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌ఓ) లెక్కల ప్రకారం వైద్య సేవలందించడంలో ఆఫ్రికాలోనే లిబియా అగ్రస్థానంలో ఉంది.

**ఇటలీ వలస రాజ్యంగా...**

వేలాది సంవత్సరాల క్రితం లిబియాలోని 90 శాతం భూమి సహారా ఎడారితోనే నిండి ఉంది. భౌగోళిక శాస్త్రవేత్తల అంచనా ప్రకారం 8000 బిసి నుండే ఇక్కడ జనజీవనం కొనసాగింది. ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారు. ఎడారిలో అక్కడక్కడ పారే చిన్న వాగులు, కాలువలను ఆధారం చేసుకొని లిబియన్లు వ్యవసాయం కొనసాగించేవారు. రాళ్లపై పెయింటింగ్‌కు అక్కడి పర్వతాలు చారిత్రక నిదర్శనంగా నిలిచాయి. 1000 బిసిలో ఫెజాన్ ప్రజలను గిరిజనులుగా పరిగణించేవారు. 500 బిసి నుండి 500 ఎడి మధ్య కాలంలో స్థానిక పాలనలో ఉంది. తూర్పు ప్రాంత ప్రజలు, సహారా ప్రాంతంలో స్థిరపడిన ప్రజలు రావడంతో లిబియా నాగరికతను సంతరించుకుంది. ఫియోనిసియన్లు లిబియన్లతో తొలుత వ్యాపార లావాదేవీలు నిర్వహించారు.

లిబియా తీర ప్రాంతమైన ఓయె, లిబ్‌దాహ్, సబ్రతా నగరాలు కలిసి ప్రస్తుత ట్రిపోలీ (మూడు నగరాలు)గా రూపాంతరం చెందింది. ఇటలీ ఆక్రమించుకున్న తర్వాత 1912 - 27 మధ్యకాలంలో లిబియాను ఇటాలియన్ ఉత్తర

ఆఫ్రికాగా పిలిచారు. 1927-34 మధ్యకాలంలో ఇటాలియన్ సైరేనైకా, ఇటాలియన్ ట్రిపోలిటానియా అనే రెండు ప్రాంతాలుగా విభజించబడింది. ఈ రెండు ప్రాంతాలు ఇటలీ ప్రభుత్వ పాలనలో ఉండేవి. ఆ కాలంలో లక్షా 50 వేల మంది ఇటాలియన్లు (లిబియా జనాభాలో 20 శాతం) ఇక్కడ స్థిరపడ్డారు. సైరేనైకా, ట్రిపోలిటానియా, ఫెజాన్ అనే మూడు ప్రాంతాలను కలిపి లిబియాగా 1934లో ఇటలీ స్థిరీకరించింది. లిబియా రెండు ప్రపంచ యుద్ధాల సమయాల్లోనూ ఇటలీ ఆధీనంలోనే ఉంది. 1943-51 మధ్యకాలంలో ట్రిపోలిటానియా, సైరేనైకాలు బ్రిటిష్ పాలనలో ఉన్నాయి. ఫెజాన్‌ను ఫ్రాన్స్ ఆధీనంలో ఉంచుకున్నది.

**1951లో స్వాతంత్ర్యం**

లిబియాకు జనవరి1, 1952లోపు స్వాతంత్ర్యం ఇవ్వాలని ఐక్యరాజ్య సమితి నవంబర్ 21, 1949లో తీర్మానం చేసింది. దానికి అనుగుణంగానే డిసెంబర్ 24, 1951లో లిబియాకు స్వాతంత్ర్యం వచ్చింది. యునైటెడ్ కింగ్‌డమ్ ఆఫ్ లిబియాకు రాజుగా ఇద్రిస్ నియమితులయ్యాడు. లిబియా రాజ్యాంగం ప్రకారం రాజు ఇద్రిస్ పాలనలో లిబియా నేషనల్ అసెంబ్లీతో పాటు ఒక అధ్యక్షుడు (మహ్మద్ అబ్దులాస్ ఎల్ ఆలెమ్), ఇద్దరు ఉపాధ్యక్షులు (ఒమర్ ఫేక్ షెనిబ్, అబూబకర్ అహ్మద్ అబూబకర్) నియమితులయ్యారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి లిబియా ఉత్తర ఆఫ్రికాలో నిరుపేద గిరిజన దేశంగానే ఉండేది. ఇది ఆఫ్రికాలో నాలుగో పెద్ద దేశం, ప్రపంచంలో 17వ పెద్ద దేశం. సాంప్రదాయకంగా లిబియా ట్రిపోలిటానియా, ఫెజాన్, సైరేనైకా అనే మూడు ప్రాంతాలు కలిగి ఉంది. 1951లో స్వాతంత్ర్యం పొంది యునైటెడ్ లిబియన్ కింగ్‌డమ్‌గా అవతరించింది. 1959లో చమురు నిక్షేపాలు బయటపడిన తర్వాత లిబియా శుద్ధమైన చమురు నిక్షేపాలు గల పదవ అతిపెద్ద దేశంగా, పెట్రోలియం నిక్షేపాలు గల 17వ అతిపెద్ద దేశంగా ఘనతకెక్కింది. 1963లో దానిపేరును కింగ్‌డమ్ ఆఫ్ లిబియాగా మార్చారు. 1969లో జరిగిన రక్తపాత రహిత విప్లవంలో కల్నల్ గడాఫీ అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. తర్వాత దేశం పేరును లిబియన్ అరబ్ రిపబ్లిక్ (అల్-జమూరియా అల్ అరబియా అల్-లిబియా)గా మార్చాడు. గడాఫీ కొన్ని సోషలిస్టు విధానాలను అవలంభించడంతో ఆ దేశాన్ని 1977-86 మధ్య కాలంలో 'సోషలిస్ట్ పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహిరియా' అని, 1986-2011 మధ్య కాలంలో 'గ్రేట్ సోషలిస్ట్ పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహిరియా' అని పిలిచారు. ఇప్పుడు కొత్తగా అధికారం చేపట్టిన నేషనల్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎన్‌టిపి) 'లిబియన్ రిపబ్లిక్' అని మార్చారు.

**గడాఫీ పాలన...**

1959లో చమురు నిక్షేపాల వెలికితీతతో అతిపేద గిరిజన దేశం అకస్మాత్తుగా ఆఫ్రికాలోనే అత్యంత ధనిక దేశంగా అవతరించింది. చమురు విక్రయంతో ప్రభుత్వ ఆదాయం భారీ స్థాయిలో పెరిగింది. ప్రభుత్వ ఆదాయం పెరగడంతో ఆ దేశాన్ని పాలిస్తున్న రాజు ఇద్రిస్ భోగభాగ్యాల్లో మునిగిపోయాడు. ప్రజా సంపదను సొంతానికి వాడుకుంటూ ప్రజల పేదరికాన్ని పట్టించుకోలేదు. పాలన స్తంభించింది. లిబియాలో ఇంజనీరింగ్ ప్రాజెక్టులను, ఆ దేశానికి ఆయుధాలను బ్రిటన్ ఎక్కువగా సరఫరా చేసింది. అమెరికా కూడా లిబియాలో అతిపెద్ద ఎయిర్‌బేస్‌ను ఏర్పాటు చేసింది. అమెరికా, బ్రిటన్ దోపిడీలు పెరగడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. సెప్టెంబర్ 1, 1969లో 27 ఏళ్ల యువ మౌమ్మర్ గడాఫీ నేతృత్వంలో చిన్న మిలిటరీ అధికారుల గ్రూపు తిరుగుబాటు చేసింది. గడాఫీని "సోదర నాయకుడు, తిరుగుబాటుకు మార్గదర్శకుడు"గా పేర్కొన్నారు. రాజు ఇద్రిస్ ప్రతిఘటించకుండానే

**దేశం : లిబియా**

**రాజధాని : ట్రిపోలి**

**అధికారిక భాష : అరబిక్**

**స్వాతంత్ర్యం పొందింది : ఫిబ్రవరి 10, 1947 (ఇటలీ నుండి ఐక్యరాజ్య సమితి ట్రస్టీషిప్‌లో యునైటెడ్ కింగ్‌డమ్ & ఫ్రాన్స్‌ల ఆధీనంలోకి మారింది)**

**డిసెంబర్ 24 1951 (యునైటెడ్ కింగ్‌డమ్ & ఫ్రాన్స్ ఆధీనం నుండి కూడా స్వాతంత్ర్యం పొందింది)**

**జనాభా : 66 లక్షలు**

**విస్తీర్ణం : 17,59,541 చదరపు కిలోమీటర్లు**

**ప్రధాన ఆదాయ వనరు : చమురు**

**కరెన్సీ : దీనార్**

**రాష్ట్రాలు : ట్రిపోలిటానియా, బర్కా, ఫెజాన్**

**ప్రధాన నది : మన్మేడ్ నది (సహారా ఎడారిలో)**



పాలనాధికారాలను గడాఫీ బృందానికి అప్పగించాడు. గడాఫీ పాలనా పగ్గాలు చేపట్టగానే దేశంలో మార్పులు చేపట్టాడు. రేడియో, టెలివిజన్‌లను ప్రభుత్వ ఆధీనం చేశాడు. ప్రధానంగా కంపెనీలను, విద్యావ్యవస్థలను ప్రభుత్వపరం చేశాడు. చమురును జాతీయం చేశాడు. 1977లో లిబియాను 'సోషలిస్టు పీపుల్స్ లిబియన్ అరబ్ జమాహిరియా'గా ప్రకటించాడు. దేశంలో గల 66 లక్షల మందికి ఉచిత విద్య, వైద్యంతో పాటు నిత్యావసర వస్తువులు ఉచితంగా అందించాడు. చదువుపై ఆసక్తి ఉండాలే కాని లిబియాలో ప్రోత్సాహానికి కరువులేదు. విదేశాల్లో చదవాలనుకునే వారందరికీ అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. అయితే తాము సంపాదించిన జ్ఞానాన్నంతా మళ్లీ దేశాభివృద్ధికే వెచ్చించాలనే నిబంధనను కఠినంగా అమలు చేస్తారు. లిబియన్లు ఆస్పత్రి మెట్లు ఎక్కిననాటి నుండి ఇంటికి వెళ్లే వరకూ చిల్లి గవ్వ కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ఎంతటి అనారోగ్యమైనా ప్రభుత్వమే భరిస్తుంది. విదేశాల నుండి మందులు, వైద్యులను తెప్పించి మరీ సేవలు అందిస్తుంది. కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. అవసరార్థం డబ్బులు కావాల్సి వస్తే లిబియా బ్యాంకులు వడ్డీ లేని రుణాలు అందిస్తాయి. యువతీ యువకులు పెళ్లి చేసుకుంటే 50 వేల డాలర్లు బహుమతిగా ఇస్తుంది. ఇల్లు కొనుక్కుని స్థిరపడేందుకు ఆర్థిక సహాయం కూడా చేస్తుంది. వ్యవసాయం చేయాలనుకునే వారికి భూమి, అవసరమైన పనిముట్లు, విత్తనాలు సమకూర్చి అండగా నిలుస్తుంది. కారు కొనుక్కువాలనుకునే వారికి సగం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. భారత్ నుండే కాదు అగ్రరాజ్యాలుగా చెలామణి అవుతున్న అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాల ప్రజలు కూడా ఉద్యోగాల కోసం పొట్ట చేతబట్టుకొని ఇతర దేశాలకు వలస వెళ్తారు. కానీ ఒక్క లిబియా పౌరుడు కూడా ఇతర దేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లిన సందర్భం లేదు. పైపెచ్చు ఇతర దేశస్తులను ఉద్యోగం కోసం ఆ దేశానికే వలస వెళ్తారు. ఇదీ లిబియా ప్రత్యేకత. ఆఫ్రికా దేశాల్లో 'లిబియా ఒక స్విట్జర్లాండ్ వంటిదని ఇటలీ జర్నలిస్టు వైవోన్ పేర్కొన్నారు.

లిబియాను 'ధనిక మధ్య తరగతి ఆదాయం' గల దేశంగా ప్రపంచ బ్యాంకు కూడా కొనియాడింది. అప్పులేని దేశం లిబియా. 1980 వచ్చే సరికి ధనిక దేశాల సరసన నిలిచింది. ఇటలీ, సింగపూర్, దక్షిణ కొరియా, స్పెయిన్, న్యూజిలాండ్ వంటి అభివృద్ధి చెందిన దేశాల కంటే లిబియాలోనే జిడిపి వృద్ధిరేటు ఎక్కువగా ఉంది. లిబియన్లను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత గడాఫీకే దక్కింది.

**మరి వ్యతిరేకత ఎందుకు..?**

లిబియాలో తన కీలుబొమ్మ రాజు ఇద్రిస్‌ను తొలగించి గడాఫీ అధికారం చేపట్టగానే అమెరికాకు వ్యతిరేకమైన చర్యలు చేపట్టాడు. అధికార పగ్గాలు చేపట్టగానే అమెరికన్, బ్రిటన్ సైనిక స్థావరాలను తొలగించాడు. అంతర్జాతీయ వేదికలపై అమెరికా పెత్తనాన్ని సవాలు చేశాడు. చమురు సంపద విలువను తెలియజెప్పి దీన్ని ఇతర దేశాలు కొల్లగొట్టుకోకుండా కాపాడాల్సిన బాధ్యత తమదేనని లిబియన్లలో నింపాడు. అలీనోద్యమంలో ముఖ్య పాత్రధారిగా ఉంటూ ఆఫ్రికా దేశాల ఐక్యత కోసం పరితపించాడు. సోవియట్ రష్యా నేతృత్వంలోని సోషలిస్టు కూటమితో సన్నిహితంగా ఉంటూ సామ్రాజ్యవాదాన్ని సవాల్ చేశాడు. తమ భూభాగం కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు అండగా నిలిచాడు. ఇజ్రాయిల్ జాత్యాహంకారాన్ని నిర్ద్వందంగా ఖండించాడు. ఇజ్రాయిల్ దాడులకు బలవుతున్న లెబనాన్‌కు మద్దతుగా నిలిచాడు. అంతేకాదు ఇజ్రాయిల్‌తో ఈజిప్ట్ అధ్యక్షుడు అన్వర్ సాదత్ శాంతి ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల ఆగ్రహించి ఆ దేశంపై శతఘ్నులు, ఫిరంగులతో దాడులు చేశాడు.

## నాటో దళాలు

నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) ఏప్రిల్ 4, 1949లో ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో ఉంది. ప్రధానంగా అగ్రదేశాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే సంస్థ ఇది. అమెరికాకు చెందిన సైనికాధికారులు నేతృత్వంలోకి నాటో వెళ్లాక వివిధ దేశాల్లో నాటో దళాల రాజకీయ జోక్యం మరీ పెరిగింది. నాటోపై ప్రపంచ దేశాలకు నమ్మకం పోయింది. నాటో దళం తొలిసారి యుగోస్లావియాలో జోక్యం చేసుకుంది. 1991-95 మధ్యకాలంలో నాటో బోస్నియాలో సైనిక చర్యను చేపట్టింది. 1999లో యుగోస్లావియాలోనూ జోక్యం చేసుకుంది. 9/11 నాడు తమ దేశంపై జరిగిన దాడులను 19 నాటో సభ్య దేశాలపై జరిగిన దాడిగా గుర్తించాలని అమెరికా తీర్మానం చేయించింది. 9/11ను సాకుగా చేసుకున్న అమెరికా తన శత్రు దేశాలపై దాడులకు నాటోను పావుగా ఉపయోగించుకోనారంభించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జోక్యం చేసుకొని తాలిబన్లను మట్టికరిపించి అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేవరకూ నాటో దళం ఆ దేశంలో తిష్టవేసింది. ఇరాక్‌లోని చమురు సంపదపై కన్నేసిన అమెరికా సద్దాం హుస్సేన్‌ను క్రూరంగా చంపి ఆ దేశంలోనే తమ నమ్మిన బంటును నియమించుకుంది. ఇప్పుడు లిబియాలోనూ తిరుగుబాటు దళాలకు మద్దతుగా ఆ దేశ రాజధాని ట్రిపోలీని నో-ఫ్లై జోన్‌గా ప్రకటించి ఆ నగరాన్ని కాపాడేందుకు మాత్రమే అక్కడికి వెళు న్నట్లు చెప్పింది. కానీ గడాఫీని హత్యచేసి తిరుగుబాటు దళాలు చంపినట్లు అబద్ధాలు ఆడింది. అమెరికా నేతృత్వంలో ఏ దేశంలోనైనా అక్రమంగా ప్రవేశించి అక్కడి అమాయక ప్రజలను దారుణంగా చంపడమే పనిగా నాటో దళాలు పెట్టుకున్నాయి. ఇది అంతర్జాతీయ ఉగ్రవాది అమెరికాకు నమ్మినబంటుగా వ్యవహరిస్తూ ఇతర దేశాల విశ్వాసాన్ని కోల్పోయాయి. నాటోలో ఏప్రిల్ 2009న కొత్తగా అల్బేనియా, క్రొయేషియా చేరాయి. డిసెంబర్ 16, 2002లో కుదిరిన బెర్లిన్ ప్లస్ ఒప్పందం ప్రకారం అంతర్జాతీయంగా ఎక్కడైనా సంక్షోభం తలెత్తితే స్వతంత్ర్యంగా జోక్యం చేసుకునే హక్కు నాటోకు ఉంది. ఈ ఒప్పందం నాటో, యూరోపియన్ దేశాల మధ్య కుదిరింది. నాటో 28 దేశాల కూటమి అయినా అందులో అమెరికా 43 శాతం, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీలు 15 శాతం చొప్పన సైనిక శక్తి కలిగి ఉన్నాయి.



ఈ చర్యలే అమెరికాకు కంటగింపుగా మారాయి. 80వ దశకంలో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, ఇంగ్లండ్ ప్రధాని మార్గరెట్ థాచర్‌లు తమ అభివృద్ధి నిరోధక ప్రయత్నాలకు అడ్డుగా నిలిచిన లిబియాతో ఘర్షణ వైఖరి అవలంబించాయి. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ అమెరికా చేసిన పనిని లిబియాపైకి నెట్టింది. యూరప్‌లో ఒక హోటల్‌పై దాడి, అమెరికా విమానం కూల్చివేత వంటి ఆరోపణలు గడాఫీపై మోపి అతడిపై క్రిమినల్‌గా ముద్ర వేయడానికి ప్రయత్నించాయి. 1986లోనే లిబియాపై, గడాఫీ నివాసంపై అమెరికా వైమానిక దాడులు చేసి ఆయన పెంపుడు కూతుర్ని చంపేసింది. గడాఫీపై ఎన్నో హత్యాయత్నాలు జరిగాయి. గడాఫీ లిబియాలో ఎన్నికలు జరపలేదని, అక్కడ ప్రజాస్వామ్యం లేదని, మానవ హక్కులు మృగ్యమని అమెరికా ప్రచారం చేసింది. కార్పొరేట్ మీడియా దానికి వంతపాడింది.

**సోవియట్ పతనంతో గడాఫీ వైఖరిలో మార్పు**

సోవియట్ యూనియన్ పతనంతో గడాఫీ వైఖరిలో మార్పు వచ్చింది. విమానం పేల్చివేతకు కారకుడైనట్లు ఆరోపిస్తున్న వ్యక్తిని అమెరికాకు అప్పగించాడు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లను కబ్జా చేసుకున్న తర్వాత ఇరాన్, లిబియాలపై అమెరికా దాడిచేస్తుందని ఎప్పుడో స్పష్టమైంది. అయితే గడాఫీ దౌత్య నీతితో ఇంతకాలం నెట్టుకొచ్చాడు. 9/11 నిందితులలో ఒకడైన అబ్దెలఖీమ్ బెల్హాడ్జ్‌ని మలేసియాలో 2003లో పట్టుకున్న అమెరికాకు చెందిన సిఐఎ మరుసటి ఏడాది లిబియాకు అప్పగించింది. అతడ్ని కొంతకాలం జైల్లో ఉంచిన గడాఫీ తర్వాత ఉదారవాద దృష్టితో విడుదల చేశాడు. అయితే బెల్హాడ్జ్ అప్పటికే సిఐఎ ఏజెంటుగా మారినట్లుంది. లిబియా ఇస్లామిక్ ఫైటింగ్ గ్రూప్ (ఎల్ఐఎఫ్‌జి) పేరుతో ఒక ఛాందస వాద సంస్థను ఏర్పాటు చేశాడు. అల్‌ఖైదా అధినేత బిన్‌లాడెన్‌ను పెంచి పోషించినట్లు బెల్హాడ్జ్‌ని కూడా అమెరికా పెంచి పోషించింది. అతడు గడాఫీపైనే దాడికి దిగాడు. ఇస్లామిక్ ఉగ్రవాదంపై పోరాటమే తన ధ్యేయమని చెప్పే అమెరికా తన వత్తాసుతో పలికే నాటోను లిబియాలో దించాడు. నాటో కూటమి బెల్హాడ్జ్ సంస్థకు అండగా నిలిచి లిబియాలో వ్యతిరేకతను ప్రోత్సహించింది. అరబ్ దేశాల్లోని సిరియా, ఈజిప్టుల్లో మాదిరిగా లిబియాలో కూడా తిరుగుబాటు దారులు పురోగమించారు. అయితే గడాఫీ ఆయన కుమారుడు వారిని నిలువరించేందుకు ప్రయత్నించారు. తిరుగుబాటు దారులు ఆక్రమించుకున్న రాజధాని ట్రిపోలీని, ఇతర ప్రాంతాలను మళ్లీ తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు గడాఫీ దళం ప్రయత్నించింది. అయితే అమెరికా కనుసన్నల్లో నడిచే ఐక్యరాజ్య సమితి ట్రిపోలీని 'నో ఫ్లై జోన్'గా మార్చి 17న ప్రకటించింది. ఆ ప్రాంతాన్ని కాపాడే బాధ్యతను నాటో దళాల ముసుగులో ఫ్రాన్స్, అమెరికా, బ్రిటన్ కూటమిలోని సైనికులు తమకుతామే స్వీకరించారు. ట్రిపోలీని కాపాడతామని వాగ్దానం చేసిన ఈ నాటో దళాలు లిబియాలో గడాఫీ అనుకూల దళాలను తుదముట్టించే పనిలో పడ్డాయి. ఏప్రిల్ 20వ తేదీన గడాఫీ నివాసాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో గడాఫీ తన స్వస్థలం సిర్తేలో తలదాచుకోవాల్సి వచ్చింది. ట్రిపోలీని కాపాడతామని వచ్చిన నాటో దళాలు గడాఫీని వెంటాడి, వేటాడి హత్య చేయడం వారి దుర్మార్గానికి నిదర్శనం. గడాఫీ మరణం తర్వాత లిబియాలో శాంతియుత పరిస్థితులు ఏర్పడతాయని, మానవహక్కులు వర్ధిల్లుతాయని భావించలేం. మాజీ సోషలిస్టు దేశాలతోపాటు ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లో అమెరికా నమ్మిన బంటైన పాకిస్తాన్‌లో ఎలాంటి పరిస్థితులున్నాయో మనం చూస్తూనే వున్నాం.

**యువతలో అసంతృప్తి**

లిబియాను గడాఫీ అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలబెట్టి అందరి మన్ననలు పొందాడు. అయితే ఇటీవల యువతరం ఆయనపై అసంతృప్తిని పెంచుకుంది. లిబియాలో కీలకమైన విభాగాల్లో విదేశీ ఉద్యోగస్తులే ఉన్నారు. ఎంత ఉన్నత విద్యను అభ్యసించినా ఉద్యోగం దొరకడం కష్టమైంది. దీంతో కొత్త తరం ప్రజల్లో నిరుద్యోగిత పెరిగింది. లిబియన్ యువకుల్లో చాలా మంది తమ కారును ట్యాక్సీగా మార్చి జీవించాల్సి వచ్చింది. ఉన్నత చదువులు చదివిన తమకు ఉద్యోగాలు లభించడం లేదన్న అసంతృప్తి వాళ్లలో పెరిగింది. యువతలోని ఈ బలహీనతను బెల్హాడ్జ్ నేతృత్వంలోని లిబియా ఇస్లామిక్ ఫైటింగ్ గ్రూప్ (ఎల్ఐఎఫ్‌జి) సొమ్ముచేసుకుంది. యువతలో మతోన్మాదాన్ని నింపి గడాఫీకి వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వాళ్లకు అమెరికా వెన్నుదన్నుగా నిలిచింది.

**ఇక కుక్కలు చింపిన విస్తరే...**

అమెరికా విష కౌగిలిలో లిబియా ఇక కుక్కలు చింపిన విస్తరిగా మారనుంది. నేషనల్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎన్‌టిసి) పేరుతో ఆ దేశంలో అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆఫ్రికాలోనే అత్యంత ధనిక దేశంగా ఓ వెలుగు వెలుగుతున్న లిబియా ప్రధాన వనరు చమురు. ఈ చమురును అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్‌లు ఎగరేసుకుపోవడం మాత్రం ఖాయం. 99.9 శాతం విద్యావంతులు గల ఆ దేశ ప్రజలు తమ దేశంలోనే పరాయివాళ్లుగా బతకాల్సి వస్తుంది. ప్రజలందరికీ అన్నీ ఉచితం పేరిట ఒక విధమైన సోషలిజం పరిఢవిల్లుతున్న లిబియాలో అమెరికా మెల్లగా తన పెట్టుబడిదారీ విధానాన్ని చొప్పించడానికి వెనకాడదు. లిబియాను కూడా తన మార్కెట్‌గా మార్చుకొని అక్కడి సహజవనరులను కొల్లగొట్టుకొని పోయేందుకు రంగం సిద్ధం చేసుకుంది. గడాఫీ బతికుండగానే ఇంగ్లండ్ ప్రధాని కామెరూన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు సర్కోజీ లిబియాకు వెళ్లి తమ కాంట్రాక్టులకు సంబంధించిన విషయాలపై ఒక ఒప్పందానికి వచ్చారు. లిబియాపై వచ్చే ఆదాయం అగ్ర రాజ్యాల మధ్య స్నేహాన్ని పెంచుతుందా లేక వారి మధ్య వైరుధ్యాలను మరింత పెంచుతుందా అనేది చూడాలి. ★


జ్ఞాపకశక్తిపై సదస్సు
సదస్సుకి వెళ్లినట్లు జ్ఞాపకం లేదు. ఇంతకీ ఏ సదస్సూ?
జ్ఞాపక శక్తిపై సదస్సు


రాజు నీకు తీయటి ముద్దు ఇచ్చాడా..?
ఏ..... అతనికేమైనా షుగరే వుందా...?
పార్క్


నీ మొహం.. మనిషి బొమ్మకు జీవం ఉట్టిపడటం కాదురా.. నిజంగా ఆయన... మనిషే...!
EXIBITI


ఎల్లలు లేనిదీ... సరిహద్దులు లేనిదీ... సర్వత్రా వ్యాపించినదీ... ఏది స్వామీ...?
'గాలి'... సంపద నాయనా
విదేశాలకు 'గాలి' సంపద


మనకి వేసవి కాలం ఎక్కువ రోజులా? వర్షాకాలమా? శీతాకాలం ఎక్కువ రోజులా?
అవేం కావు! కోతల కాలం ఎక్కువ రోజులు సార్
సంవత్సరంలో ఋతువుల రోజులు
కోతల కాలం.


మన వెంకటేశమే.. అదేదో కంపెనీ నెట్‌వర్కు సిమ్ వాడుతున్నాట్ట! అప్పట్నుండి అలా...


మీ వారు బాగా పొదుపు మనిషా..? ఎలా చెప్పగలుగుతున్నావు..?
'పట్టు' చీర అడిగితే పట్టుపురుగుల్ని తెచ్చి పెంచుతున్నారే..!


రహస్యంగా ఉంచాల్సిన విషయాల్ని.. అలా బయటకెళ్లి అందరికి వినపడేలా.. గట్టిగా అరుస్తూ మాట్లాడుతున్నారేమిటండీ...?
ఏం చేయమంటావే... సిగ్నల్ లాగటంలేదు మరి...!!!

# శాస్త్రీయదృష్టితో గతచరిత్ర

**భా**రతదేశ చరిత్ర గురించి అనేక గ్రంథాలు వెలువడుతున్నాయి. వీటిలో శాస్త్రీయదృక్పథంతో వెలువడినవి కొన్ని మాత్రమే. అలాంటి వాటిలో ఒకటి ఇప్పుడు మనం చెప్పుకుంటున్న రొమిల్లా థాపర్ గ్రంథం 'భారతదేశ చరిత్ర'. భారతదేశ చరిత్ర రచనలో కాలగమనంలో అనేక మార్పులు వచ్చాయి. ఆయా రచయితలు అప్పటి వారి అవసరాలకనుగుణంగా, వారి ప్రయోజనాలకు అనుగుణంగా చరిత్రకు భాష్యం చెప్పడానికి పూనుకున్నారు. దాని ప్రకారమే యుగవిభజనలు కూడ జరుగుతూ వచ్చాయి. జాతీయోద్యమ కాలంలో వచ్చిన గ్రంథాలు సైతం దీనికి అతీతం కాదు. కాని చరిత్రను పూర్తి వస్తుగతంగా పరిశీలన జరపడం 50 దశకం నుండి మాత్రమే మొదలయిందని చెప్పవచ్చు. దాన్ని ప్రారంభించినది డిడి కొసాంబి. చరిత్ర గమనాన్ని ఉత్పత్తి శక్తుల స్థాయి, ఉత్పత్తి సంబంధాలు- వాటి ప్రాతిపదికన ఏర్పడే సామాజిక, రాజకీయ సంబంధాలు, సాంస్కృతిక జీవనాల ద్వారా విశ్లేషించడానికి ఆయన పూనుకున్నారు. అనేక ఫలితాలనూ ఆయన సాధించారు. చరిత్ర అధ్యయనంలో ఆయన చూపిన మార్గాన్ని తర్వాత పలువురు ముందుకు తీసుకుపోయారు. ఇటీవలనే మృతిచెందిన ఆర్ఎస్ శర్మ వారిలో ప్రముఖులు. అలాంటి వారితో దీటుగా నిలబడకలిగిన చరిత్రకారిణి రొమిల్లా థాపర్. ఆమె తనంతతానుగా చరిత్రరచనలో మునిగిపోలేదు. వక్రీకరణలకు అతీతంగా గతచరిత్రను శాస్త్రీయరీతిలో అవగాహన చేసుకోవడానికి ఉన్న వర్తమాన ప్రాధాన్యతను ప్రచారం చేయడానికీ తీవ్రంగా కృషి చేశారు. అందుచేతనే ఆర్ఎస్ శర్మతో సహా ఆ తరహా ఇతర చరిత్రకారులతో పాటు హిందూత్వవాదుల దాడికి లక్ష్యంగా మారారు. అలాంటి రొమిల్లా థాపర్ ఇంతకుముందు పెంగ్విన్ వారు రెండు సంపుటాలుగా ప్రచురించిన భారతదేశ చరిత్రలో మొదటి సంపుటాన్ని

రచించారు. అది చరిత్రపూర్వయుగం నుండి 1526 వరకు చరిత్రను వివరిస్తుంది. పెంగ్విన్ వారి పున:ప్రచురణలో వాటిని మూడు సంపుటాలుగా మార్చడానికి ఆమె ఒప్పించి ఈ తాజా గ్రంథరచన చేశారు. ఈ తొలి సంపుటం చరిత్రపూర్వయుగం నుండి క్రీ.శ 1300 వరకు మాత్రమే పరిశీలిస్తుంది. అయినా గత ప్రచురణ కన్నా దీనిలో పేజీలో చాల అధికం. పరిమాణం రీత్యానే కాదు విషయ విశ్లేషణలోనూ ఇది మరింత సమగ్రమైనది. ఆంగ్లంలో కొద్ది సంవత్సరాలక్రితం వెలువడిన ఇంతటి ప్రసిద్ధ గ్రంథాన్ని ఇప్పుడు తెలుగులో అలకనంద వారు ప్రచురించారు. 600 వందల పేజీల బృహత్‌గ్రంథాన్ని తెలుగులో తీసుకురావడానికి పూనుకోవడం నిజంగా సాహసమే. పైగా అనువాదాన్ని మరో చరిత్రకారునితో చేయించకలిగారు. డా. కె. యస్. కామేశ్వరరావుగారి అనువాదం మొత్తంమీద సాఫీగానే సాగింది. చరిత్ర నిపుణులకేకాకుండా, సాధారణ పాఠకులకు సైతం సులభంగా అర్థమయ్యే, అవసరమయ్యే ఈ గ్రంథం ధర పేజీల రీత్యా చూసుకుంటే తప్పదేమోకాని, అందరికీ అందుబాటులో ఉంటుందని చెప్పలేము. ఇలాంటి ప్రామాణిక గ్రంథాన్ని తెలుగులో తెచ్చిన ప్రచురణకర్తలు, అనువాదకులు ఎంతగానో అభినందనీయులు.

**భారతదేశ చరిత్ర, రొమిల్లా థాపర్, అనువాదం:డా॥కె.యస్.కామేశ్వరరావు, వెల : 350/-, పేజీలు : 600, ప్రతులకు : అశోక్ బుక్ సెంటర్, 13-1-1సి, ఎస్.టి.ఆంథోని చర్చి కాంపౌండ్, జగదాంబ జంక్షన్, విశాఖపట్నం - 520002.**

**- విజయరావు**

# హాయిగా నవ్వించే నాటకాలు



**1950** ప్రాంతంలో జయపూర్ మహారాజా విక్రమదేవ వర్మ రాజమండ్రి వచ్చినప్పుడు భమిడిపాటి కామేశ్వరరావు గారిని 'హాస్య బ్రహ్మ' బిరుదుతో సత్కరించారు. వీరి కుమారుడైన రాధాకృష్ణ కూడా మంచి నాటక రచయిత, సినీ రచయిత. 'కీర్తిశేషులు' అనే గొప్ప నాటకం రాశారు. 1926 నాటికే కామేశ్వరరావుగారు కథలు, వ్యాసాలు భారతి పత్రికలో రాసి ఖ్యాతి పొందారు. కాలక్షేపం, గుసగుస, పెళ్లి నాటకాల్లో హాస్య రసాన్ని పండించిన కామేశ్వరరావుగారు షెరిడన్, గోల్డ్‌స్మిత్... ఆంగ్ల నాటకాల్ని ఆంధ్రీకరించారు. నాటక రంగంలో వీరిది ఓ ప్రత్యేక శైలి. వన్స్‌మోర్, ఇప్పుడు అన్నీ తగాదాలే, తిండి వేషాలు, అప్పుడు, పెళ్లి ట్రెనింగ్, రెండు రెళ్లు, మాయల మాలోకం, ప్రణయరంగం, ఈడూ-జోడు, వినయప్రభ, చెప్పలేం, స్వరాజ్యం, నిజం కూడా అబద్ధమే, ఆంధ్ర నాటక పద్య పఠనం, లాంటి నాటక సంబంధ రచనలు అందించారు. వీరి రచనల్ని సంపుటాలుగా 'విశాలాంధ్ర' ప్రచురణాలయం తీసుకురావడం అభినందనీయం. మొదటి సంపుటిలో (హాస్య వల్లరి) కాలక్షేపం, గుసగుస పెళ్లి, రెండవ సంపుటిలో వ్యాసాలు, మూడవ సంపుటిలో ఈసఫ్ కథలు.. ఇక ఈ నాల్గవ సంపుటిలో షెరిడన్ గోల్డ్‌స్మిత్ ఆంగ్ల నాటకానుసరణలు... చక్కటి తెలుగుదనంతో రాశారు. మన తెలుగు నాటకాలే అనిపిస్తాయి. ప్రణయరంగం, ఈడు-జోడు, వినయప్రభ, చెప్పలేం! నాటకాలు ఈ సంపుటిలో వున్నాయి. ఏడు రంగాలు గల రూపకం 'ప్రణయరంగం'. దీన్ని రిచర్డ్ బ్రిన్ స్లీ షెరిడన్ (1751-1816) రచనల్లోని 'రైవల్సు' మూలకథలోంచి చక్కటి హాస్యంతో కామేశ్వరరావు గారి కలం కదిలింది. కథాపరంగా కల్పకం అనే కన్యను, ఆమెను ఆశించే దేవయ్య (ప్రియుడు), మరో కాముకుడైన జ్వాలారంగం, కల్పకం జోడి కుమార సేనం (కథా నాయకుడు), అతని తండ్రి ముసలి జమిందారు పరాంకుశం, కల్పకం మేనత్త రాంభాణమ్మ, ఆమె దాసి ఉళక్కి మధ్య ఈ కథాంశం హాస్యంతో వుంటుంది. అలాగే మరో నాటకం 'ఈడు-జోడు'. ఇది కూడా షెరిడన్ రచన 'డ్యూయెన్నా' లోనిది. ఆ కాలంలో వృద్ధులు కన్నెల్ని పెళ్లాడడం అనే అంశాన్ని చక్కటి హాస్యంతో కన్యాశుల్కానికి కొంచెం ఆధునికంగా భమిడిపాటి ఈ రచన చేసినట్లు అనిపిస్తుంది. పెళ్లి కూతురు ముసలి వేషంలో పలాయనం, ముసలావిడ పెళ్లి కూతురవడం, ముసలి వరుడే పెళ్లి కూతురికి రాయబారి కావడం, మఠం తోటలో మరో (పెళ్లి) జంట. నాటి ఆచార వ్యవహార స్థితిగతుల్ని తెలియజేస్తాయి. విశాల, కిషోరి పాత్రల్ని కవి అద్భుతంగా మలచిన తీరు... మండోదరం పాత్ర లుబ్ధావధానుల్ని (కన్యాశుల్కంలో) గుర్తు తెస్తుంది. తాగుబోతులో మంచిని, మానవత్వాన్ని, 'వినయ ప్రభ'లో చూపిస్తారు రచయిత. ఓలివర్ గోల్డ్‌స్మిత్ 'షి స్టూప్స్ టు కాంకర్' ఈ నాటకానికి మూలం (1730-1774). వీరి సొంత రచన (భమిడిపాటిది) 'చెప్పలేం' కూడా ఓ చక్కటి హాస్యం పండించిన మంచి నాటకం. ఈ నాటకాలు కాలేజీ, విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రదర్శించుకుంటే ఆనాటి సామాజిక నేపథ్యం, నేటి స్థితి అవగతం అవుతాయి. హాయిగా నవ్వుకునే మంచి హాస్య నాటకాలివి.

**భమిడిపాటి కామేశ్వరరావురచనలు, రచన : భమిడిపాటి కామేశ్వరరావు. పేజీలు : 230, వెల : 110/-, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విశాలాంధ్ర అన్ని షాపులు.**

**-తంగిరాల చక్రవర్తి**



**వికాసం**

దంపతుల మధ్య శారీరక, మానసిక, ఆత్మ సంబంధమైన అన్యోన్య బంధం పెళ్లి. స్పష్టంగా చెప్పాలంటే పెళ్లనేది భాగస్వాముల మధ్య ప్రత్యేకమైన వ్యక్తిగత అనుబంధం ఏర్పడేందుకు పునాది. పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ, ఒకరిపై మరొకరు ఆధారపడి షరతులు లేని ప్రేమాభిమానాలతో సాగిపోయే జీవితానికి ఆహ్వానం పలికే ఒక మధురమైన సన్నివేశం.

# దాంపత్యం ఉల్లాసంగా... ఉత్సాహంగా...


- సి.వి. సర్వేశ్వరశర్మ

ఫోన్ నెం: 9866843982

sarma.chavali@gmail.com

**పెళ్లి** కేవలం భార్యాభర్తలు సంసార సుఖం అనుభవిస్తూ పిల్లల్ని కనడం కోసమే కాదు. తోడుగా, నీడగా కష్టసుఖాల్లో, ఆరోగ్య, అనారోగ్య సమయాల్లో, ఎండా వానల్లో ఒకరికొకరు ఆసరాగా ఉంటూ దాంపత్య మాధుర్యాన్ని పొందడం కోసం.

మనిషి మాత్రమే జంతువులకు భిన్నంగా హేతుబద్ధంగా ఆలోచించగలడు. జంతువుల కలయిక కేవలం వాటి జాతి అంతరించిపోకుండా పునరుత్పత్తి కొనసాగించడానికి మాత్రమే నిర్దేశించబడింది. పర్యావరణ పరిరక్షణలో ఇదొక భాగం కూడా.

మనుషుల్లో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంటుంది. భాగస్వామి పట్ల అంకితభావం ఎంతో ముఖ్యం. పెళ్లితో మనుషుల జీవితాల్లో చాలామందికి ఒక కొత్త మలుపు మొదలవుతుంది. మతాలు ఏవైనా పెళ్లి అనేది భాగస్వాములు జీవితకాలం కలిసి ఉండాలన్నది ప్రధాన ఆశయం.

ఒకప్పుడు తల్లిదండ్రుల ఇష్టానుసారం పెళ్లిళ్ల జరిగేవి. ఇప్పుడు పెళ్లికి ముందే యువతీ యువకుల స్నేహాలు, ప్రేమలు, డేటింగుల వంటివి జరుగుతున్న సందర్భాలున్నాయి.

సుడిగాలిలా ప్రేమ మొదలై పెళ్లైన కొద్ది రోజులకే విడాకులు తీసుకుంటున్న జంటలు ఎన్నో. దీనికి ప్రధాన కారణం వారికి సరైన మార్గదర్శకాలు చెప్పేవారు లేకపోవడం, ఆపైన కొన్ని లైంగిక భ్రమలు వీరిని ఈ స్థితికి తెచ్చిపెడుతున్నాయి.

వీరి ఆధిక్య పోరాటంలో తీవ్రంగా నష్టపోయేది వారి పిల్లలు. వారి జీవితాలకు కావలసిన రక్షణ కరువైపోతోంది. ఈ విషయంపై విడాకులు తీసుకునే దంపతులు ఆలోచించే స్థితిలో ఉండరు. పెళ్లనేది ఆట కాదు. తొందర తొందరగా నిర్ణయాలు తీసుకుని తర్వాత విచారిస్తే ప్రయోజనం ఉండదు.

ఊహాత్మక జీవితానికి వాస్తవిక జీవితం భిన్నంగా ఉంటుంది. చాలా సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుంది. జీవితంలో పూలపాన్పుల కన్నా ముళ్లబాటలే ఎక్కువగా ఉంటాయి.

సినిమాల్లో చూపించినట్లు జీవితాలు ఉండాలని తప్పటడుగులు వేయకూడదు. భార్యాభర్తల మధ్య సామాజిక, ఆర్థిక, ఆవేశ, మేధా పరమైన సమతుల్యత ఉండాలి.

భార్యాభర్తల మధ్య చిన్న చిన్న సంఘటనలే పెద్ద పెద్ద అగాధాలు సృష్టించే ప్రమాదం ఉంది. వంటింట్లో కుళాయి లీకవుతుంటే బాగు చేయించమని భార్య చెబుతుంది. పని ఒత్తిడిలో వాయిదాలు వేయడం మంచిది కాదు.

తన సొంతం అనే భావన అధికంగా ఉండే భాగస్వాముల్లో అసూయ వస్తుంది. భాగస్వామి శరీరం, మనసు, తెలివి, ప్రవర్తన వంటివి అన్నీ తనవి మాత్రమే అనుకునే వారుంటారు. ఇది ఎలుగుబంటి కౌగిలి మాదిరి తయారవుతుంది. మనసు అర్థం చేసుకుని ఒకరినొకరు ఊపిరి పీల్చుకునే వ్యవధిని సమకూర్చుకోవాలి.

భాగస్వామితో వ్యంగ్యంగా మాట్లాడ్డం లేదా మౌనంతో ఇబ్బంది పెట్టడం వంటి ఆయుధాలు ఎప్పుడూ ప్రయోగించకూడదు. భావాన్ని స్పష్టంగా చెప్పగల్గడం, ఇరువురి మధ్య భావ ప్రసారం విచ్ఛిన్నం కాకుండా చూసుకోవడం అన్యోన్య దాంపత్యానికి సహకరిస్తాయి.

ప్రేమతో చేసే పనులను చిరు అభినందనలతో మెచ్చుకోవడం, గుర్తించినట్లు సంకేతాల ద్వారా తెలియజేయడం వల్ల దంపతుల మధ్య ప్రేమ, అనురాగం పెరుగుతుంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ భాగస్వామి 'ఇగో'ని స్పృశించకూడదు. దానిని గౌరవించడం మరువకూడదు. ఇద్దరూ సర్దుకుపోయే ధోరణి అలవరచుకుంటే వారి సంసారం చూడముచ్చటగా ఉంటుంది. అతిగా పొగడనవసరం లేదు. పెద్ద మనిషి తరహాగా, ఉన్నతమైన ఆలోచనలతో ఉండాలి. దానివల్ల వారి జీవితం ఆనందమయం అవుతుంది.

**శాంతంగా ఉండాలి!**

భాగస్వామి తాను చెప్పదలచుకున్న విషయాన్ని చక్కగా వ్యక్తపరచలేకపోవచ్చు. ఏం చెప్పదలచుకున్నారో దాన్ని వారి శరీర భాష ఆధారంగా గ్రహించగల్గాలి. చెప్పలేక పోతున్న విషయాలను కూడా ఊహించగల్గాలి. ఉత్సాహంగా ఏదైనా చెపుతున్నప్పుడు వినాలి. మధ్యలో అడ్డుతగలకూడదు.

భాగస్వామి చెప్పేదాన్ని ఖండించకూడదు. మనిషి ఆత్మగౌరవం దెబ్బతిందంటే వివాహ పునాదులు కదిలిపోతాయి.

ఒకరినొకరు ఆమోదించుకుంటూ, మానసికంగా సమతుల్యత పాటిస్తూ గౌరవంగా ఉండడం వల్ల భార్యాభర్తల జీవితం సంతోషంగా ఉంటుంది. దంపతుల మధ్య దాంపత్య సుఖం జీవితకాలం పాటు అనివార్యంగా ఉండాలని ఆశించకూడదు. క్రమక్రమంగా శారీరక సుఖం నుండి మానసికానందం వైపు జీవితం సాగుతుంది.

పోటీ ప్రపంచంలో విజయాన్ని చేపట్టాలన్న తాపత్రయంలో చాలా మంది పడకింటి జీవితం గురించి మర్చిపోతుంటారు. పిల్లల చదువుపై పర్యవేక్షణ, అనారోగ్యపు పిల్లలు, హద్దులోపల పనులు పూర్తి చేయడం వంటి సమస్యలు దాంపత్య జీవితాన్ని దెబ్బతీస్తాయి. యవ్వనం జారిపోతే దాన్ని తిరిగి పొందడం సాధ్యం కాదు. ఏ వయసు ముచ్చట ఆ వయసులో తీరాలి.

భార్యాభర్తలు అనుకూల దృక్పథం అలవరచుకుంటే ఒత్తిడితో నలిగిపోరు. సమస్యలకు పరిష్కారం ఇరువురి ఆలోచనలు సమకూరుస్తాయి.

ఏ ఇద్దరి అభిప్రాయాలు ఒకే మాదిరిగా వుండవు. వాగ్యుద్ధాలు జీవితాన్ని విషాదం వైపు తీసుకుపోతాయి. ముఖ్యంగా పడకగదిలో సమస్యలను చర్చించడం మొదలుపెట్టకూడదు. స్నేహితులు భాగస్వాములుగా ఉండరు. భాగస్వాములు స్నేహితులుగా ఉండరని చాలామంది నమ్మకం. కాని భాగస్వామి స్నేహంగా ఉన్నప్పుడే జీవితం అన్ని విధాల వికసిస్తుంది. ★

తరతరాలను వయసుతో నిమిత్తం లేకుండా అలరించిన అసాధారణ చిత్రం 'పాతాళభైరవి'. అసాధారణం ఎందుకంటే సినిమా వినోద ప్రాధాన్యత కలిగిన మాధ్యమం. వినోదం క్షణ మాత్రం. అంటే ఆ క్షణంలో ఆస్వాదించి మరచిపోతాం. కొన్ని హాస్య సంఘటనలు గుర్తుకొచ్చినప్పుడల్లా గిలిగింతలు పెడతాయి. అదీ కొంత కాలం. మంచి సంఘటన ఐతే దశాబ్దం పాటు. కానీ అరవై సంవత్సరాల పాటు తరతరాలను రంజింపచేయడం సాధారణ విషయం.కాదు. అదీ కేవలం వినోదాన్ని పంచే సినిమా. అందుకే 'పాతాళభైరవి' వినోదం పంచే సినిమా. నాలుగు తరాల వారు వయసుతో సంబంధం లేకుండా ఆ చిత్రం చూసి ఆనందించారు. వచ్చే తరాలను కూడా ఆనందింపచేస్తుందనడంలో ఆశ్చర్యం లేదు.

# కాల పరీక్షకు నిల్చిన కల్పన

"జనం కోరేదే మనం చేయాలా...మనం చేసేది జనం చూడాలా..." సాధారణంగా వచ్చే అసాధారణ సందేహం. దీనికి సమాధానం నేపాళ మాంత్రికుని మాటలలో మాట(ల) నేర్పరి పింగళి వారి దివ్యోపదేశం "ప్రజారంజన సేయాలిరా..."

శబ్ద రత్నాకరుడు పింగళి చమత్కారాలు "మహా జనానికి మరదలు పిల్లా ఇక్కడున్న వారందరూ బావలే", "గలగలలాడవే గజ్జల కోడి", "సాహసం సేయరా అభీష్టం నెరవేరుతుంది. రాకుమార్తె లభిస్తుంది", "గయ్యాళితనము మాని వయ్యారముగా వలపు సూపవే బుల్‌బుల్ పిట్టా", "అడ్డమల్లా గడ్డమే గురూ...", "తోటకల్లా పరిమళం తెచ్చే పువ్వు", "చావడం కూడా ఇంత కష్టంగా వుంటే ఎలా చావడం", "వరపుత్రుడివిరా"... "పాతాళ బిలం", "అక్షయ ఘట్టం"... ఒకటా రెండా అన్నీ చతురోక్తులే.

పాత్రలు, తోటరాముడు, అతని జతగాడు అంజి, నేపాళ మాంత్రికుడు, శిష్యుడు సదాజపుడు, ఉజ్జయిని రాజు, రాజకుమారి, రాణి, ఆమె తమ్ముడు...

అనధికార అధికార పీఠం రాజుగారి బావమరిది వీరశూరసేనుడు...ఈ పాత్ర మృచ్ఛకటికం నాటకంలో శకారుడి పాత్రను తలపిస్తుంది. కథ అల్లాఉద్దీన్ అద్భుత దీపం కథను లీలగా స్ఫురణకు తెస్తుంది. ఛాయామాత్రంగా అంత వరకే వినూత్నమైన కథ. అద్భుతమైన సృష్టి.

నేటివిటీకి ఉజ్జయినీ నగరాన్ని నేపథ్యంగా తీసుకున్నారు. దృశ్యాల కూర్పు అమోఘం. మచ్చుకు కొన్ని. సత్రంలో జపం చేసుకుంటున్న సదాజపాన్ని లేపి అంజి వివాహానికి ఆహ్వానించడం కథకు మలుపు. వాడు వెళ్లి తోటరాముడు చంపిన మాంత్రికుడిని సంజీవని స్పర్శతో బతికిస్తాడు. మాంత్రికుడు అదివరకే తన చేతిని అగ్నికి ఆహుతి చేసి సంజీవనితో తిరిగి అతికించడాన్ని ప్రేక్షకులు అప్పటికే చూస్తారు.

రాజుగారి బావమరిది పాతాళభైరవి ప్రతిమను సంపాదించడానికి తిప్పలు పడి ఆ సందర్భంలో ప్రతిమను నుదిటికి తాకించి పాతాళభైరవిని తలచుకోగానే పాతాళభైరవి ప్రత్యక్షమై "నరుడా ఏమి నీ కోరిక" అంటే "పరస్త్రీ తప్పు తప్పు..." అంటూ అక్కడి నుంచి పారిపోవడానికి ప్రయత్నించడం. ప్రతిమను నేపాళీ మాంత్రికుడికి అప్పజెప్పడం. చెప్పులు...కంబళి కోసం రక్కసుల పోరు, వాటిని ఏమార్చి అంజి ఆ దివ్య వస్తువుల సాయంతో మాయా మహల్ చేరడం అన్నీ ఆంధ్రులను సమ్మోహ పరచిన దృశ్యాలే.

కాగితం మీద కథను తెరమీదకు నేర్పుగా తెచ్చారు దర్శకుడుకె.వి.రెడ్డి. ఆ సరికే వారు గుణసుందరి, యోగి వేమన, పెద్దమనుషులు, పోతన వంటి దృశ్యకావ్యాలను తెలుగు వారికి అందించారు.

ఆరోజుల్లోనే అసాధారణమైన సెట్టింగులు, స్పెషల్ ఎఫెక్ట్స్ చూపించేరు. కత్తుల ద్వారం, మాంత్రికుడి గుహ, పాతాళభైరవి మందిరం, పాతాళ బిలం, మాయా మహల్, అన్నిటినీ మించి మాయా మహల్ గాలిలో ఎగురుతూ ఉజ్జయిని చేరడం అన్నీ చిత్రవిచిత్రాలే... కథానాయకునికి తోడు హాస్యనటుడు ఆయన సృష్టించిన ఒరవడి. ఛాయా గ్రాహకుడు మార్కస్ బారెట్లీ, కళా దర్శకుడు గోఖలే ప్రతిభాపాటవాలు మహత్తరం. మార్కస్ 'చందమామ, వెన్నెల' ఎన్నో సినిమాలలో తెలుగు వారిని ఎంతో ఆహ్లాదపరుస్తాయి.

పాటలు ఆ పాత మధురాలు. "ఎంత ఘాటు ప్రేమయో", "కలవరమాయె మదిలో, రాజుగారి బావమరిది ప్రేమగోల, వినవే బాలా" ఘంటసాల స్వరరచనలో కర్ణాపేయమైన పాటలు అన్నీ మధురాతి మధురాలు. ఈ నాటికీ ఏనాటికీ అవి నిత్య నూతనాలు. ఎన్నటికీ వసివాడని పూవులు.

సాహసి తోటరాముడిగా ఎన్‌టిరామారావు నటన అమోఘం. నేపాళ మాంత్రికుడిగా ఎస్వీ రంగారావు అత్యద్భుతం. అతని నట జీవితానికి సోపానాలు వేసిన చిత్రమిది. అప్పటి దాకా ఇటువంటి పాత్రలకు ముక్కామల పెట్టినది పేరు. సహజమైన నటనతో మాంత్రికుని వేషానికి కొత్త సొగసులు అద్దేరు యశస్వి యస్వీ.

ఉజ్జయిని రాజుగా సిఎస్ఆర్, రాజుగారి బావమరిదిగా రేలంగి, కథానాయకుడి నేస్తం అంజిగా బాలకృష్ణ, నేపాళ మాంత్రికుడి శిష్యుడు సదాజపునిగా పద్మనాభం అందరూ అందరే.

సదాజపుడి వేషంలో అంజి మాంత్రికుడిని బురిడీ కొట్టించడం సాధారణంగా ఒప్పించడం కష్టమైన పనే. కానీ ఈ సినిమా ప్రేక్షకులను ఎంతగా మంత్రముగ్ధులను చేసిందంటే అసలా విషయాన్ని తలపుకు రానీయదు. ఒకవేళ ఎవరైనా గుర్తించినా దానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. సరికదా దానికి ఆమోదించి ఆనందించి ఆదరించారు.

'షావుకారు' చిత్రాన్ని నిర్మించిన విజయావారి కానుక 'పాతాళభైరవి'. ఈ కథ, సన్నివేశాల కూర్పు పాతిక సంవత్సరాల తర్వాత ఈ చిత్రాన్ని హిందీలో పున:నిర్మించారు పద్మాలయా బ్యానర్‌పై కృష్ణ సోదరులు. ఆ సినిమా కూడా రజతోత్సవాలు జరుపుకుంది. కనక వర్షం కురిపించింది. అంతమంచి దృశ్యకావ్యాన్ని, వాటి ముచ్చట్లని ఒక్కసారి స్మరించుకొనే ప్రయత్నం ఇది. జై పాతాళ భైరవి.

**-కె.వి.ఎస్.కె.ఎస్. పాపారావు**

|  |  |  |  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|---|---|---|
|  | 1 | 3 |  |  |  |  | 4 |  |
|  |  | 6 | 1 |  | 5 |  |  |  |
|  | 5 |  |  | 4 | 8 |  |  | 9 |
| 1 |  |  | 5 |  | 7 | 4 |  |  |
|  | 9 | 7 |  | 3 |  | 5 | 6 |  |
|  |  | 5 | 4 |  | 9 |  |  | 1 |
| 5 |  |  | 6 | 1 |  |  | 7 |  |
|  |  |  | 9 |  | 2 | 1 |  |  |
|  | 2 |  |  |  |  | 9 | 3 |  |

## సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో కొన్ని అంకెలు కూడా ఇచ్చాం. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి. సరేనా...



## ఏది ఎక్కడ?

నేస్తాలూ... పైన ఓ కప్ప బొమ్మఉంది. పక్కనే దానికి సంబంధించిన విడి భాగాలు ఉన్నాయి. వాటిని ఎలా అమరిస్తే అందులో ఇమిడి పోతాయో చూసి పెట్టేసెయ్యండి.

## ఆహ్వానం

హాయ్ నేస్తాలూ! మీరు కథలు, కవితలు, బాగా రాస్తారట కదా. జోక్స్ బొమ్మలు, సూపర్‌గా వేస్తారట. మీకు బోలెడన్ని తమాషా ప్రశ్నలు - జవాబులు, చారిత్రక ఘట్టాలు తెలుసంట కదా. మరి అవన్నీ ఎంచక్కా పోస్టు కార్డుమీద రాసి పంపండి. మీ పేరు, స్కూల్‌తో సహా ప్రచురిస్తాం.


<u>మా చిరునామా</u>

బాలనేస్తాలు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజామాబాద్,
ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.





## ఎలా చేస్తే వస్తుంది?

ఫ్రెండ్స్... పక్కన కొన్ని గుర్తులు, అంకెలు ఉన్నాయి. వాటి సాయంతో 48=93-25-58+38. అని చూపించాలి. అది ఏ వరుసలో చేస్తే వస్తుందో చేయండి.

## మన నాయకులు

బుజ్జాయిలూ..మన దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న వారిలో బోసినవ్వుల తాత ఒకరు. కింద ఆయన పక్కనున్న ఇద్దరు కూడా స్వతంత్రపోరాటంలో పాల్గొన్నవారే. వారి పేర్లు ఏమిటో మీకు తెలుసా? త్వరగా చెప్పేయండి.



## ఎక్కడ దాక్కుంది!?

ఎలుగుబంటి జంట షికారుకి బయలుదేరింది. వారితో పాటు వాళ్ల చిట్టి ఎలుగుబంటి కూడా వచ్చింది. కానీ ఉన్నట్టుండి చిట్టి ఎలుగు మాయమైంది. అది అక్కడే దాక్కుని అమ్మా నాన్నతో 'నేనెక్కడున్నానో కనుక్కోండి' అని ఆడుతోంది. మీరు చెప్పండి అది ఎక్కడుందో!




## తెలుసా?

హాలో... మీకోచిన్న పరీక్ష, పైన ఒక దేశ పటం ఉంది. ఇది ఏ దేశానిదో చెప్పాలి. మీకో చిన్న క్లూ. ఈ మధ్యనే ఆ దేశంలో హైస్పీడ్ రైళ్లని ప్రవేశపెట్టారు.



ఫ్రెండ్స్... వేలి ముద్రతో మీరూ ఇలా చేయడానికి ప్రయత్నించండి

# చిలువలు

పిల్లలూ... ఇవాళ చెప్పుకోబోయే పక్షి పేరు ఈలవేసే చిలువ. దీన్నే చిన్న చిలువ అని కూడా అంటారు. దీని శరీరం చెస్‌నట్ రంగులో ఉంటుంది. ఈ రంగు మరే పక్షికీ ఉండదు. దీని పేరైతే ఈలవేసే పక్షి కానీ, దాని ఈల మాత్రం కర్ణకఠోరంగా ఉంటుంది. నీరు పుష్కలంగా ఉండే ప్రదేశాలంటే దీనికి చాలా ఇష్టం. అందుకే ఎక్కువగా అక్కడే కనిపిస్తుంది. ఈ పక్షి గుంపుతో కలిసి జీవిస్తుంది. కరువు పరిస్థితుల్లో వలస పోతుంది. ఇది నీటిలో మునిగి కొద్ది సేపు అలాగే ఉండగలదు. చిన్న కప్పలు, నత్తలు, చేపలను ఇష్టంగా తింటుంది. వీటితో పాటు వడ్ల గింజలను కూడా తింటుంది. ఈ జాతికి చెందిన మరో పక్షి పెద్ద చిలువ. దీని శరీరం తెల్లగా ఉంటుంది. మరో పక్షి దూది చిలువ. ఇది చూడ్డానికి బాతు ఆకారంలో వుంటుంది. మగ పక్షికి మెడమీద బెల్టు పెట్టినట్టుగా నల్లటి పట్టీ లాంటి చార ఉంటుంది. శరీర పై భాగం నల్లగా, మిగతా భాగం తెల్లగా ఉంటుంది. ఆడపక్షి గోధుమ రంగులో ఉంటుంది. దీని శరీరం మీద ఎటువంటి మచ్చలు ఉండవు. ఇది కూడా గుంపులోనే జీవిస్తుంది. ఇది ఎగిరేటప్పుడు మాత్రమే అరుస్తుంది. మిగతా సమయాల్లో శబ్దం చేయదు.






నేర్చుకుందామా...

**జవాబులు**

సుడోకు:

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 1 | 3 | 2 | 7 | 6 | 8 | 4 | 5 |
| 8 | 4 | 6 | 1 | 9 | 5 | 3 | 2 | 7 |
| 7 | 5 | 2 | 3 | 4 | 8 | 6 | 1 | 9 |
| 1 | 6 | 8 | 5 | 2 | 7 | 4 | 9 | 3 |
| 4 | 9 | 7 | 8 | 3 | 1 | 5 | 6 | 2 |
| 2 | 3 | 5 | 4 | 6 | 9 | 7 | 8 | 1 |
| 5 | 8 | 9 | 6 | 1 | 3 | 2 | 7 | 4 |
| 3 | 7 | 4 | 9 | 8 | 2 | 1 | 5 | 6 |
| 6 | 2 | 1 | 7 | 5 | 4 | 9 | 3 | 8 |

ఎలా చేస్తే వస్తుంది?:



తెలుసా?: చైనా

మన నాయకులు : గాంధీతాత, సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబూ రాజేంద్ర ప్రసాద్

# మాటల కోట - 74

రూపకల్పన : కొమ్మాలపాటి

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | ■ | 4 | 5 | | 6 |
| | ■ | 7 | | 8 | ■ | | ■ | |
| 9 | 10 | | ■ | 11 | | ■ | 12 | |
| ■ | | ■ | 13 | | ■ | 14 | | ■ |
| 15 | | 16 | | ■ | 17 | | ■ | 18 |
| | ■ | | ■ | 19 | ■ | 20 | | ■ |
| 21 | 22 | ■ | 23 | | 24 | | ■ | 25 |
| ■ | 26 | | | ■ | | ■ | 27 | |
| 28 | | ■ | 29 | | | | | |

**అడ్డం**

1. ఏకదంతుడే (4)
4. వ్యాధిని నయం చేసేది (4)
7. సొత్తు (3)
9. ఇంగ్లీషు జ్వరం (3)
11. అందని... పుల్లన (2)
12. ప్రవహించు (2)
13. 'అణాకాణి'లో రెండవది (2)
14. 'సగం' అని రక్కున చెప్పండి (2)
15. పాతకాలంలో పిండి విసిరేది (4)
17. నూరు వేలు (2)
18. వెళ్లమని ఒక్క అక్షరంలో చెప్పండి (1)
20. సాహితీవేత్త 'రాచమల్లు రామచంద్రారెడ్డి' పొట్టి పేరు (2)
21. అబ్బా... , దోశ; అప్పడం (2)
23. ఇవతల కాదండీ బాబూ... (4)
26. ఉరకలు వేసే యవ్వనం (3)
27. అరటికాయల గుత్తి అటునుండి (2)
28. అద్వానీ యాత్ర పేరు చెప్తే చాలు గుర్తొచ్చేది (2)
29. నుదుటిన దిద్దుకొనేది (4)

**నిలువు**

2. కరెంటును ఇంగ్లీషులో పిలవండి (3)
3. 'తినగ' వేము చేదు అన్నారు పెద్దలు. అంత్యాక్షరం లోపిస్తే (2)
5. అరువది (2)
6. వర్షం ఆగకుండా పడుతూనే ఉంది (3)
8. శివుడి భార్య (3)
10. మంత్రి (3)
12. పలుగు తోటిది (2)
13. అందె దేనికి ఆభరణం (2)
14. ఇంటి పత్రాల్లో దాని విలువ ఎంతో ఇలా రాస్తారు (4)
16. తెలంగాణా ప్రాంతంలో దొరల ఇళ్లను ఇలా పిలుస్తారు. ఏకవచనమే (2)
21. ఆజ్ఞ. కింది నుండి పైకి (3)
22. రాజులు, మునులు పెట్టే ఒట్టు (4)
23. సోదరి (3)
24. వెదురు బొంగులతో అల్లేది. గుడిసె తలుపులుగా వాడతారు (3)
25. మార్క్స్ మిత్రుడు (3)

**మాటలకోట - 73 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఎ | ర | ■ | 2 అ | గ్ని | ■ | 3 సా | వి | 4 త్రి |
| ద్యా | ■ | 5 య | మ | ■ | 6 ప | క్షి | ■ | వ |
| 7 ర | ణం | ■ | 8 ల | 9 హ | 10 రి | ■ | 11 క | ర్గ |
| ప్ర | ■ | 12 వె | ■ | 13 రి | వా | జు | ■ | ప |
| ■ | 14 ప | న్న | ■ | 15 త | రం | ■ | 16 పో | తా |
| 17 వా | స్తు | ■ | 18 ఊ | క | ■ | 19 బ | ర | క |
| ర్ | ■ | 20 చే | ■ | 21 ము | 22 ని | ■ | డు | ■ |
| 23 స్ట్రీ | మ్ | ■ | 24 పా | ■ | 25 వా | లి | ■ | 26 ఊ |
| ట్ | ■ | 27 ఠీ | పా | వ | ళి | ■ | 28 లం | హ |

హ్హ... హ్హ...

## బరువు తగ్గటం ఎలా?

**తి**నటం తప్ప మరొకటి ఎరగని వాడిలా పెద్ద శరీరంతో ఒక వ్యక్తి డాక్టరు వద్దకు వచ్చాడు.

నేను బరువు తగ్గాలంటే ఏం చెయ్యాలి డాక్టారూ అన్నాడు.

సింపుల్ , రెండురోజులు వరుసగా తిను, తరువాత ఒకరోజు మానెయ్, తరువాత రెండురోజులు తిను, ఒకరోజు మానెయ్ ఇలా రెండు వారాల పాటు చేశావనుకో డ్రమ్ములా ఉన్నవాడివి స్లిమ్ముగా మారిపోతావ్, ఈసారి నాదగ్గరకు వచ్చేటప్పటికి కనీసం రెండు-మూడు కిలోల బరువు తగ్గుతావ్ అన్నాడు డాక్టర్.

రెండువారాల తరువాత బక్కపలుచగా ఉన్న ఒక వ్యక్తి వచ్చాడు. ముందు గుర్తుపట్టకపోయినా తరువాత డాక్టర్‌కు ఆశ్చర్యమేసింది. నీవు నేను చెప్పినట్లే చేశావా, ఇంకేమైనా చేశావా ఇంతలా తగ్గావ్ అన్నాడు.

నిజం చెప్పమంటారా డాక్టర్! రెండురోజుల తరువాత మూడో రోజు చచ్చిపోతానేమో అనిపించేది డాక్టర్.

ఏమిటీ ఆకలికా?

కాదు డాక్టర్ 'తినకపోతే' అని బెంగపెట్టుకున్నా.. దాంతో ఇదిగో ఇలా అయ్యా అన్నాడు.



# మాట్లాడే చిలుక

-పుప్పాల కృష్ణమూర్తి

పూర్వం రాంజీ అనే పెద్ద మోసగాడుండేవాడు. అతను మహారాజుల్నే బోల్తా కొట్టించేవాడు. ఒకరోజు చంద్రసేనుడి ఆస్థానానికి వచ్చి "శుభోదయం మహారాజా. ఈ చిలుక అద్భుతమైనది. మనిషిలా మాట్లాడగలదు. అంతేకాదు. భూత, భవిష్యత్తు, వర్తమానాలు తెలుసు. హిమాలయాల్లో ఒక ముని దగ్గర పదేళ్లు సేవ చేసి దీన్ని సంపాదించాను. ఇంత విలువైన పక్షి తమరి వద్ద ఉండడమే శుభమని తీసుకొచ్చాను. తమరు పరీక్షించుకోవచ్చు" అన్నాడు.

"సరే చూద్దాం. ముందు నా గతం గురించి చెప్పమను" అన్నాడు చంద్రసేనుడు.

దాంతో చిలుక పంజరానికి ఎడమవైపు తట్టాడు రాంజీ. వెంటనే చిలుక "మీరు చాలా కష్టపడి, స్వయంకృషితో రాజయ్యారు" అంది.

దాని మాటలు విని రాజు చాలా సంతోషించాడు. "నా వర్తమానం గురించి చెప్ప" అన్నాడు ఆసక్తిగా.

రాంజీ పంజరాన్ని మెల్లగా కదిలిస్తున్నట్లు నటిస్తూ కుడివైపు తట్టాడు. "ప్రజలు సుఖశాంతులతో ఆనందంగా ఉన్నారు. ఇలాంటి రాజు ఇక ముందు పుట్టబోడని ప్రజలు చెప్పుకుంటున్నారు" అంది చిలుక.

"మరి భవిష్యత్తో..." అన్నాడు రాజు భావి జీవితాన్ని తెలుసుకోవాలనే కోరికతో.

రాంజీ వెంటనే పంజరాన్ని తట్టాడు.

"మీరంటేనే శత్రువులకు వణుకు. తమ రాజ్యంవైపు కన్నెత్తి చూడడానికే భయపడతారు. రాబోయే 50 ఏళ్ల వరకు మీ కత్తికి తిరుగులేదు" అంది చిలుక తన ముద్దు ముద్దు మాటలతో.

చంద్రసేనుడి మనసు ఆనంద డోలికల్లో తేలిపోయింది. మీసాల్ని మెలేస్తూ "దీని ఖరీదెంత? ఇది మా భవనంలో తప్పక ఉండాలి" అన్నాడు.

"చెప్పాను కద మహారాజా. ఇది సామాన్యమైనది కాదు. ముని తన తపశ్శక్తితో దీనికి దివ్య శక్తినిచ్చాడు. లక్ష వరహాలిప్పించండి" అన్నాడు వినయంగా.

వెంటనే చంద్రసేనుడు తన ఖజానా నుండి లక్ష వరహాలు ఇప్పించాడు. అవి తీసుకున్న రాంజీ అక్కడ్నుండి వచ్చినంత వేగంగా వెళ్లిపోయాడు.

చిలుక పంజరాన్ని తీసుకెళ్లి తన అంతఃపురంలో పెట్టాడు చంద్రసేనుడు. రోజూ లేవగానే చిలుకకు పండు ఇస్తూ "నా గురించి చెప్పు" అని అడిగేవాడు.

"తమరు గొప్ప దయామయులు. తమ కీర్తి సూర్యకాంతిలా భూమండలమంతా వ్యాపిస్తోంది. మీ శౌర్యాన్ని అందరూ గొప్పగా చెప్పుకుంటున్నారు" అని ముద్దుగా పలికేది.

ఈ ఆనందంలో రాజ్యం గురించి మర్చిపోయి తిని, తాగసాగాడు చంద్రసేనుడు. ప్రజల్ని పట్టించుకోకపోవడంతో రాజ్య పాలన అస్తవ్యస్తంగా తయారైంది. రాజోద్యోగులు ప్రజల్ని పీడించుకు తినసాగారు. వర్షాలు లేక, నీళ్లు దొరక్క జనం అలమటించసాగారు. అక్కడ పనులు దొరక్క పక్క రాజ్యానికి వలస పోసాగారు. నగరంలోని ప్రజలు తిండి దొరక్క భిక్షాటనకు, దొంగతనాలకి అలవాటయ్యారు.

చంద్రసేనుడు మాత్రం చిలుక పలుకులు వింటూ వందిమాగధులు ఇచ్చే సమాచారాన్ని తెలుసుకుంటూ కాలం గడుపుతున్నాడు.

అదను కోసం చూస్తున్న పొరుగు రాజు రాజవర్ధనుడు ఒకనాడు హఠాత్తుగా యుద్ధం ప్రకటించాడు. సైన్యానికి తగిన శిక్షణ లేక, ప్రజల సహకారం లేక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న చంద్రసేనుడి రాజ్యాన్ని తేలికగానే జయించాడు రాజవర్ధనుడు.

నేరుగా రాజభవనానికి చేరుకున్న రాజవర్ధనుడు ముద్దు ముద్దు మాటలు చెప్తున్న చిలుక పంజరాన్ని పట్టుకున్నాడు.

చిలుక వెంటనే 'మీరంటే శత్రువులకు వణుకు. మీ కత్తి మార్కు మీసాలను చూసి శత్రురాజులు తమరి రాజ్యం వైపు కన్నెత్తి కూడా చూడరు. రాబోయే 50 ఏళ్ల వరకు మీ కత్తికి తిరుగులేదు' అని పాఠం ఒప్పజెప్పింది.

'అబ్బో... ఈ చిలుక చాలా ప్రమాదకారి. చంద్రసేనుణ్ణి ఈ పొగడ్తలతోనే నిద్రపుచ్చింది. ఇప్పుడు నన్ను పొగుడుతోంది. దీన్ని నమ్మితే నేనూ చంద్రసేనుడిలా తయారవుతాను' అని దాన్ని పంజరం నుండి వదిలేశాడు.





# పురాతన ఇళ్లు



ఏంటి? వీటిని చూస్తుంటే సముద్రపు ఒడ్డున పిల్లలు కట్టుకున్న ఇసుక గూళ్లు గుర్తొస్తున్నాయా! అలాగైతే మీరు ఇసుకలో కాలేసినట్టే. ఇవన్నీ కొండ గుహలను పోలిన ఇళ్లు. ఇరాన్‌లోని తూర్పు అజర్‌బైజాన్ ప్రాంతంలోని కండోవన్ గ్రామంలో వున్నాయి. అసలు ఆ గ్రామం నిండా ఇలాంటి గుహలే కనిపిస్తాయి. వీటికి కొన్ని వందల ఏళ్ల చరిత్ర వుందని కొందరు చెప్తారు. కాదు వేల సంవత్సరాల నాటివని మరి కొందరంటారు. కాకపోతే గుహలను తొలిచి నిర్మించుకున్న ఆ ఇళ్లల్లో ఇప్పటికీ జనసంచారం వుంది. మరో తమాషా ఏమంటే గ్రామం నడిబొడ్డున వున్న కొన్ని ఇళ్లను హోటళ్లు, రిసార్టులుగా మలిచారు. పర్యాటకులు అక్కడికొచ్చి ఎంచక్కా సేదతీరుతుంటారు. కాకపోతే దానికి తగ్గ రుసుము చెల్లించాలనుకోండి. ఇక్కడ లభించే నీటికి ఔషధ లక్షణాలున్నాయని విశ్వసిస్తుంటారు పర్యాటకులు.